

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755





కార్తీక పౌర్ణమి గరుడసేవ



తిరుమలలో శుక్రవారం కార్తీక పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. సర్వాలంకార భూషితుడైన మలయప్పస్వామి సాయంత్రం 7 గంటలకు గరుడుడిపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆహ్లాదకర వాతావరణంలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, భక్తుల కర్పూర హారతులు, గోవిందనామస్మరణల నడుమ గరుడసేవ కనులపండువగా జరిగింది. కార్తీకమాసంలో నిర్వహించే గరుడసేవ కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కొన్ని చిరుజల్లులు పడటంతో ముందు జాగ్రత్తగా ఘటాటోపం కింద స్వామిని ఊరేగించారు. ఈ వాహనసేవలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అమ్మవారికి బంగారు వైజయంతిమాల కానుక



అధికారులకు బంగారు వైజయంతి మాల అందజేస్తున్న దాతలు

టీటీడీ ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ డీకే ఆదికేశవులునాయుడు కుమార్తె తేజస్విని, మనవరాలు చైతన్య శుక్రవారం తిరుచానూరులోని పద్మావతి అమ్మవారికి కానుకగా బంగారు వైజయంతి మాలను సమర్పించారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్‌ను కలిసి దాతలు ఈ ఆభరణాన్ని అందజేశారు. కార్యక్రమంలోసూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

కార్తీక పౌర్ణమి వెలుగులు



తిరుమలలో అఖిలాండం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా శివాలయాల్లో సందడి నెలకొంది. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులతో ఆలయాలు రద్దీగా మారాయి. సాయంత్రం భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

- తిరుపతి (కల్చరల్), ఆంధ్రజ్యోతి



తిరుపతిలోని ఇందిరా మైదానంలో కార్తీక దీపాల వెలుగులు

తిరుమలలో మాత్రం వచ్చే నెల 15న

తిరుమలలో డిసెంబరు 15వ తేదీన కార్తీక పౌర్ణమి దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు. సాధారణంగా తెలుగు సంప్రదాయం ప్రకారం ఈనెల 2వ తేదీన మొదలైన కార్తీకమాసం డిసెంబరు 1వ తేదీతో ముగుస్తుంది. ఆ ప్రకారం రాష్ట్ర మంతటా ఆలయాల్లో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు జరిగాయి. ఇక, తమిళ సంప్రదాయం ప్రకారం కార్తీకం నవంబరు 17వ తేదీన మొదలై డిసెంబరు 15వ తేదీ వరకు ఉంటుంది. అదే రోజు పౌర్ణమి కూడా. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబరు ఒకటో తేదీతో కార్తీక నెల ముగిసినా.. తిరుమలలో మాత్రం తిరువణ్ణామలై దీపాన్ని అనుసరించి డిసెంబరు 15వ తేదీన పౌర్ణమి సందర్భంగా కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలో కైంకర్యాలు, పూజలన్నీ దాదాపు తమిళ సంప్రదాయంలోనే ఉంటాయి. దీంతో ఈ కార్తీకదీపోత్సవాన్ని కూడా ఎప్పటిలానే తమిళ సంప్రదాయం మేరకు డిసెంబరు 15న నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. ఆ రోజున సాయంత్రం స్వామివారికి కైంకర్యాలు, నివేదనలు పూర్తయిన తర్వాత వంద కొత్త మూకుళ్లలో నేతి వత్తులతో దీపాలను వెలిగించి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహిస్తారు. వాటిని శ్రీవారి ఆలయం లోపల, బయట, పుష్కరిణి వంటి ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఒక్కడూ లేడా?



- రెండేళ్లలో 21,066 ట్యూబెక్టమీ ఆపరేషన్లు
- వేసెక్టమీకీ ముందుకురాని మగవాళ్లు
- నేడు ప్రపంచ వేసెక్టమీ దినోత్సవం

కుటుంబ నియంత్రణ పద్ధతులు మహిళలకు, పురుషులకు ఇద్దరికీ సంబంధించిన విషయం. అయితే కు.ని. శస్త్రచికిత్సలు మహిళలే చేసుకోవాలనే రీతిలో మగవాళ్లు ఉన్నారు. గడిచిన రెండేళ్లలో మహిళలకు 21,066 ట్యూబెక్టమీ ఆపరేషన్లు జరగ్గా.. వేసెక్టమీ చికిత్సకు ఒక్క పురుషుడూ ముందుకు రాలేదు. మహిళల కంటే మగవారికి చేసే చికిత్స చిన్నపాటిది. దీనికితోడు వీరు త్వరగా కూడా కోలుకునే అవకాశం ఉంది. అయినా, వీరు ముందుకు రావడంలేదు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

జిల్లాలో గతేడాది జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 9,721, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో 3,400 ట్యూబెక్టమీ... ఈ ఏడాది అక్టోబరు వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 5,340, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో 2,605 ట్యూబెక్టమీ శస్త్ర చికిత్సలు జరిగాయి. ఇలా 21,066 మంది మహిళలు ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేసుకోగా.. ఈ రెండేళ్ల కాలంలో వేసెక్టమీ సర్జరీలు ఒక్కటి కూడా జరగలేదు. ఈ చికిత్సలకు మగవారు ముందుకు రావడం లేదంటే అది అవగాహన లోపమా లేదా భయమా అనేది ప్రశార్థకంగా మారింది. గతంలో మగవారికి వేసెక్టమీ చికిత్స చేయాలంటే చిన్నపాటి కోత చేసి శస్త్ర చికిత్స చేసేవారు. ఆధునిక పరిజ్ఞానంతో ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రుల్లో కూడా ఎటువంటి కోత, కుట్లు లేకుండా అరగంట వ్యవధిలోనే వేసెక్టమీ శస్త్ర చికిత్సను పూర్తి చేస్తున్నారు. అనంతరం గంటలోనే యథావిధిగా ఇళ్లకు వెళ్లి మరుసటి రోజు నుంచి దినసరి పనులను, ఉద్యోగాలు చేసుకునే అవకాశం కూడా ఉంది. ఆస్పత్రిలో అడ్మిషన్‌లో ఉండాల్సిన పని లేదు. అయినప్పటికీ వేసెక్టమీకి మగ వారు ముందుకు రాకపోతుండటంతో మహిళలే ట్యూబెక్టమీ శస్త్ర చికిత్సలు చేయించుకోవాల్సి వస్తోంది. మహిళలయితే కనీసం రెండు రోజుల వరకు విశ్రాంతిలో ఉండాలి. కానీ కాన్పుల అనంతరం ఎలాగు విశ్రాంతి తీసుకుంటారు కదా అదే సమయంలో ట్యూబెక్టమీ శస్త్ర చికిత్స కూడా చేసుకుంటే సరిపోతుందిలే అని మగవారు తప్పించుకునే ధోరణితో కేవలం ఈ గర్భనిరోధక చికిత్సలకు మహిళలనే ముందుకు నెడుతున్నారు. దీంతో వేసెక్టమీ చికిత్సలకు ఏ ఒక్కరూ ముందుకు రావడం లేదు. కాగా, లింగ వివక్షతో కొందరు.. వేసెక్టమీపై అవగాహన లేక మరికొందరు మగవాళ్లు ముందుకు రావడం లేదని కొందరు వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నాం



కుటుంబ నియంత్ర పద్ధతుల్లో భాగంగా ట్యూబెక్టమీ, వేసెక్టమీ పద్ధతులపై అన్నీ పీహెచ్‌సీల పరిధిలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి భార్యాభర్తలకు అవగాహన కల్పిస్తున్నారు. కానీ వేసెక్టమీ చికిత్సలకు ఒక్కరూ ముందుకు రావడం లేదు. వేసెక్టమీ వల్ల దాంపత్య జీవితానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవనే విషయాన్ని మగవాళ్లు తెలుసుకోవాలి. వేసెక్టమీ చికిత్సలకు ముందుకు రావాలి. అప్పుడే మహిళలకు కూడా ఆరోగ్య పరంగా కొంత ఉపశమనం ఉంటుంది.

- డాక్టర్ శ్రీహరి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి

సులభ పద్ధతుల్లో వేసెక్టమీ



వేసెక్టమీ అంటే భయపడే రోజులు పోయాయి. ఇప్పుడు కోత, కుట్లు లేకుండానే సులువుగా నిమిషాల వ్యవధిలోనే వేసెక్టమీ చికిత్సను పూర్తి చేస్తున్నాం. మరుసటి రోజునే యథావిధిగా వారి పనులు చేసుకునే వీలుంటుంది. శారీరక కలయికకు మాత్రం మూడు నెలలు కండోమ్‌లను ఉపయోగించడం సురక్షితం. లేకపోతే మళ్లీ గర్భం వచ్చే అవకాశాలు అరుదుగా ఉంటాయి. గర్భనిరోధక పద్ధతులు మహిళల కోసమే అనే అపోహ వీడి, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మగవాళ్లు వేసెక్టమీ సర్జరీలకు ముందుకు రావాలి.

- డాక్టర్ పార్థసారథిరెడ్డి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్

టమోటా లారీ దగ్ధం

- ఇద్దరికి గాయాలు



పాకాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలం గుంతగాదంకి లోతువంక సమీపంలో శుక్రవారం రాత్రి టమోటా లారీ బోల్తాపడి దగ్ధమైంది. చిత్తూరు వైపు నుంచి తిరుపతికి టమోటా లోడుతో వేగంగా వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఆ వెంటనే మంటలు వ్యాపించడంతో లారీ కాలిపోయింది. లారీ డ్రైవర్, క్లీనర్ నాగరాజు, పుల్లయ్య తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నేషనల్ హైవే అంబులెన్స్ సిబ్బంది తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపుచేశారు. ఈ సంఘటనతో రాకపోకలకు గంటపాటు అంతరాయం కలిగింది. ప్రమాద స్థలాన్ని సందర్శించి పోలీసులు కేసు నమోదు చేశారు.

జిల్లాలో జోరువాన

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో శుక్రవారం ఉదయం వరకు జిల్లాలో పలు ప్రాంతాల్లో జోరువాన కురిసింది. మూడు రోజులుగా వర్షం విడతల వారీగా పడుతూనే ఉంది. పలు ప్రాంతాల్లో కాలువలు పొంగి, వీధులు జలమయమయ్యాయి. చిట్టమూరు 73.8మి. మీ. శ్రీకాళహస్తి 62.2, తొట్టంబేడు 60.2, దొరవారిసత్రం 53.8, వాకాడు 48.2, సూళ్లూరుపేట 41.8, ఓజిలి 37.2, వరదయ్యపాళెం 35.4, వెంకటగిరి, రేణిగుంట 27.6, ఏర్పేడు 27.4, డక్కిలి 27, పెళ్లకూరు, తిరుపతి అర్బన్ 23.8, బుచ్చినాయుడుకండ్రిగ 20.2 వర్షపాతం నమోదైంది.

WANTED

WANTED FACULTY

Part Time / Full Time

JAVA, Phython,

Tally, Photoshop,

Marketing Executive (M)

Bike Must

Leelamahal circle, Pillar Number -65, Opposite Future Technologies, TIRUPATI.

88855 00054



మీ అభిమాన థియేటర్లలో

DEEPA ARTS 9908817549, 8125432278

డిసెంబరు నాటికి పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖకు సంబంధించి పీజీఆర్ఎస్ అర్జీలను డిసెంబరు నెలాఖరులోగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. భూ సంబంధిత అర్జీల పరిష్కారంతో గ్రామాల్లో చాలా వరకు సమస్యలు తీరుతాయన్నారు. భూముల సర్వే సక్రమంగా చేపట్టాలన్నారు. 22ఏ పెండింగ్ ప్రతిపాదనలుంటే వాస్తవ విషయాలతో నివేదిక అందించాలన్నారు. ఇసుక రవాణా విషయంలో ప్రజలను ఇబ్బంది పెట్టవద్దన్నారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఆర్డీవోలు భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, జిల్లా సర్వే అధికారి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

30నాటికి మూడు ఇసుక పంపిణీ పాయింట్లు

ఈనెల 30వ తేదీ నాటికి మూడు ఉచిత ఇసుక (డిస్టిలేషన్) పంపిణీ పాయింట్లు అందుబాటులోకి రానున్నాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. విజయవాడ నుంచి భూగర్భ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా, కమిషనర్ ప్రవీణ్‌కుమార్ వర్చువల్ విధానంలో చేపట్టిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. పెళ్లకూరు మండలం పుల్లూరు, పాలచ్చూరు, కోట మండలం గూడలిలో 1.37లక్షల టన్నుల ఇసుక లభ్యమవుతోందన్నారు.

గురుకులంలో కొనసాగుతున్న వైద్య శిబిరం

సత్యవేడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎంజేపీబీ బాలుర గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం కొనసాగుతోంది. పాఠశాలలో 60 మంది విద్యార్థులు గురువారం జ్వరం బారిన పడిన విషయం తెలిసిందే. సత్యవేడు ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవలు పొందిన పలువురు శుక్రవారం సాయంత్రం డిశ్చార్జి కాగా, కొంతమందిని వారి తల్లితండ్రులు ఇళ్లకు తీసుకెళ్లారు. మరో పదిమందికి తాజాగా జ్వరం సోకినట్లు తెలిసింది. డాక్టర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పాఠశాలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. మంత్రులు సవిత, సత్యకుమార్ వేర్వేరుగా కలెక్టర్ వెంకటేశ్వర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఇక్కడి పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగించుకుని ఎమ్మెల్యే ఆదిమూలం నేరుగా ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తమైతే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని సిబ్బందిని హెచ్చరించారు. మరో వైపు ఎంపీడీవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి మునిరవికుమార్ ఆధ్వర్యంలో పాఠశాలలో పారిశుధ్య చర్యలను ముమ్మరం చేశారు. వైసీపీ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్, మండల కన్వీనర్ సుశీల్‌కుమార్ రెడ్డి తదితరులు ఆస్పత్రికి చేరుకుని విద్యార్థులను పరామర్శించారు.

ఒక్కొక్కటిగా వెలుగులోకి..

- క్షేత్రస్థాయి పరిశీలనలోనేతేటతెల్లమవుతున్న అక్రమాలు
- మరో మూడు రోజుల పాటు కొనసాగనున్న విచారణ
- దాదాపు వంద అనుమానిత ఆస్తులకు కొలతలు
- టీడీఆర్ లింక్డ్ ఆస్తులపై ప్రత్యేక దృష్టి

తిరుపతి, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పాలక సంస్థలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వ అధికారులపై విచారణ కమిటీ శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లింది. అనంతపురం రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలో మూడు బృందాలుగా విడిపోయి అనుమానిత ఆస్తులకు కొలతలు వేశారు. ముఖ్యంగా మాస్టర్ ప్లాన్ రోడ్లు వేసిన చోట, టీడీఆర్ లింక్డ్ ఆస్తులపై ప్రత్యేక దృష్టిపెట్టారు. అడ్డగోలుగా పన్నులు వేయడం, తగ్గించడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న గత రెవెన్యూ అధికారి కేఎల్ వర్మకు సంబంధించిన రికార్డులను గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో విచారణ బృందం పరిశీలించింది. వాటి ఆధారంగా శుక్రవారం క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లినప్పుడు పలు అక్రమాలు వెలుగుచూసినట్టు తెలిసింది. మూడు బృందాలు కలిపి దాదాపు వంద ఆస్తులకు సంబంధించి కొలతలు వేసి, వాటిని మళ్లీ రికార్డులను ముందు పెట్టుకుని పరిశీలిస్తున్నారు. టీడీఆర్ బాండ్ల కోసం రెసిడెన్షియల్ ఆస్తులను కమర్షియల్ కింద మార్చారన్న ఆరోపణల నేపథ్యంలో వాటిని లోతుగా పరిశీలిస్తున్నారు. ఈ వ్యవహారం కొందరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల మెడకు చుట్టుకోనుందన్న ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా గత మేనేజర్ చిట్టిబాబు, డీఈ విజయకుమార్ రెడ్డిపై వచ్చిన ఆరోపణలపైనా విచారించేందుకు సిద్ధమవుతున్నారు. ఇష్టారాజ్యంగా బిల్లులు చెల్లింపులు చేసినట్టు గుర్తించారు. జగనన్న విద్యాదీవెన కార్యక్రమంలో స్నాక్స్ కోసం రూ.33లక్షల బిల్లులు చెల్లింపు జరిగినట్టు గుర్తించారు. రెండు బిల్లులుగా ఆ మొత్తాన్ని ఓ ఈవెంట్ కాంట్రాక్టర్‌కు ముట్టజెప్పినట్టు తెలిసింది. వీటిపైనా ఆరాతీస్తున్నారు.

లోతుగా విచారిస్తున్నాం

డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్స్ (డీఎంఏ) ఆదేశాల మేరకు విచారణ నిమిత్తం మూడు బృందాలు తిరుపతికి చేరుకున్నాం. శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశాం. రికార్డులను ముందు పెట్టుకుని వాటిని లోతుగా విచారణ చేస్తున్నాం. అప్పుడే స్పష్టత వస్తుంది. విచారణలో సిబ్బంది సహకరిస్తున్నారు. మరో మూడు రోజుల పాటు విచారణ చేసి, పూర్తి నివేదికను డీఎంఏకు అందజేస్తాం.

- విశ్వనాథ్, రీజనల్ డైరెక్టర్



మీ అభిమాన థియేటర్లలో

DEEPA ARTS 9908817549, 8125432278

అన్నప్రసాద కేంద్రంలో ఘనంగా ఆయుధపూజ


పూజలు చేస్తున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, న వంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని తరిగొండ వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనంలో శుక్రవారం ఆయుధపూజ ఘనంగా జరిగింది. ముందుగా వేద మంత్రోచ్చారణ మధ్య పద్మావతి, వేంకటేశ్వరస్వామి చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత అన్నప్రసాదాల తయారీకి వినియోగించే యంత్రాలు, పాత్రలకు పూజలు చేశారు. అన్నదానం సిబ్బందిని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీఈవోలు రాజేంద్ర, ఆశాజ్యోతి, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, సిబ్బంది, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపక పురస్కార గ్రహీతలకు సన్మానం



రమేష్‌కుమార్- నాగరాణిలను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

పాకాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక పురస్కార గ్రహీత, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ రమేష్‌కుమార్‌ను కళాశాలలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా ఆధ్వర్యంలో సహ అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో అంకిత భావం, నిబద్ధత కలిగిన రమేష్‌కుమార్‌కు రాష్ట్రస్థాయిలో పురస్కారం లభించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో బాలుర జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, జిసిజిటిఏ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులు పార్థసారథినాయుడు పాల్గొన్నారు. ● భాకరాపేట: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత,చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు నాగరాణిని కళాశాల సిబ్బంది శుక్రవారం సత్కరించారు. ఇంటర్ బోర్డు అధికారి విశ్వనాథ నాయక్ పాల్గొన్నారు.

గరుడ వాహనంపై కల్యాణ వెంకన్న అనుగ్రహం



చంద్రగిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తి గరుడ వాహనంపై మాడ వీధుల్లో ఊరేగి దర్శనమిచ్చారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్, అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణచార్యులు, పార్థసారిధి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శశిరేఖ

భాకరాపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు(జీపీడీపీ)పై సర్పంచులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌ఆర్‌డీ సోమశేఖర రెడ్డి, సూపరింటెండెంట్‌లు సతీశ్ కుమార్, మదనమోహన్ రాజు, ఏఈలు ప్రకాశ్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు. ●పాకాల: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో శశిరేఖ ఆధ్వర్యంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘం సభ్యులకు, మండల స్థాయి అధికారులకు అభివృద్ధి ప్రణాళికల తయారుపై అవగాహన కల్పించారు. జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, డీఎల్‌పీవో రూపారాణి తదితరులు పాల్గొన్నారు. ●రామచంద్రాపురం:ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై రెండు రోజుల శిక్షణ ను ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు.

తిరుచ్చిపై పద్మావతిదేవి



తిరుచానూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతిదేవి శుక్రవారం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవర్లకు తిరుమంజనం జరిగింది. అలంకార శోభితురాలైన అమ్మవారు తిరుచ్చిపై మాడవీధుల్లో ఊరేగారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏవీఎస్వో సతీష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

జగన్‌పై అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోండి

చంద్రగిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్,ఆయన కుటుంబ సభ్యులపై అసభ్యకర పోస్టులు పెట్టిన టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తల మీద చర్యలు తీసుకోవాలని వైసీపీ నేతలు శుక్రవారం సీఐ సుబ్బరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, యారాశి చంద్రశేఖర్ రెడ్డి, బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు హరిహర చౌదరి మృతి


ఫైల్ ఫొటో

చంద్రగిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కందులవారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పులివర్తి హరిహరచౌదరి (70) శుక్రవారం మృతి చెందారు. ఈయన గతంలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. అనంతరం టీడీపీలో చేరారు. కొన్ని రోజులుగా అనారోగ్య కారణంగా చికిత్స పొందుతున్నారు. శుక్రవారం ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయానికి శనివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

భాకరాపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు సూచించారు. చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో కార్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. క్లస్టర్ టీడీపీ ఇన్‌ఛార్జ్ శివకుమార్ సీఈవోను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించాలని కోరారు. ఎంపీడీవో గిడ్డయ్య, ఈవోపీఆర్‌ఆర్‌డీ సోమశేఖర రెడ్డి, సూపరింటెండెంట్‌లు సతీశ్ కుమార్, మదనమోహన్‌రాజు పాల్గొన్నారు.

టీడీపీ నేత సాయికి పలువురి జన్మదిన శుభాకాంక్షలు



తిరుచానూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ తిరుచానూరు గ్రామ పంచాయతీ ప్రధాన కార్యదర్శి సాయిరాయల్ జన్మదిన వేడుకలు శుక్రవారం రాత్రి నిర్వహించారు. భారీ కేక్ కట్ చేశారు. ఆయనను టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అమిలినేని మధు, పార్టీ నేతలు మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, శ్రీధర్‌నాయుడు, గణపతినాయుడు, హరేరామ్‌రెడ్డి, వాసు తదితరులు దుశ్శాలువాతో సన్మానించారు.

పెచ్చులూడి.. నెర్రెలిచ్చి..

● శిథిలావస్థకు చేరిన ఏవీపురం ఎంపీపీ స్కూల్
● చెట్లకిందే విద్యార్థుల చదువులు




గదిలో పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా ఇలా- తరగతి గదిలో కోడిగుడ్లు, స్టీల్‌గ్లాసులు, ప్లేట్లు - ఆరుబయట చెట్లకింద విద్యార్థుల చదువులు

తిరుపతిరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వేదాంతపురంలోని ఏవీపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చామని పదేపదే గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ పాలకులు శిథిలావస్థకు చేరిన ఈ పాఠశాలను రెండోదశలో ఎంపిక చేయడం గమనార్హం. 40 ఏళ్ల కిందట ఏర్పాటైన ఈ స్కూల్‌లో తరగతి గదుల పైకప్పు పెచ్చులూడిపోతున్నాయి. గోడలు నెర్రెలు చీలి ప్రమాదకరంగా మారాయి. ఆరు బయట రేకుల వరండా.. చెట్లకింద చదువు సాగిస్తున్నారు. చినుకుపడితే నీరు తరగతి గదుల్లోకి చేరుతోంది. ఐదు తరగతుల్లో 59మంది చదువుతుండగా..నలుగురు టీచర్లు పనిచేస్తున్నారు. మూడు తరగతిగదులు ఉన్నాయి. ఒక గదినిండా నాడు-నేడు ద్వారా పాఠశాలకు చేరిన డెస్కులు, వాటర్‌ప్యూరిఫైర్, ఇతర మెటీరియల్‌ని నింపి పట్టతో కప్పి ఉంచారు. మరో గదిని బీరువా, స్టీల్ పాత్రలు, గ్లాసులు, కోడిగుడ్లను భద్రపరిచేందుకు ఉపయోగిస్తున్నారు. మిగిలిన చిన్నపాటి గదిలో 10-15మంది కూర్చునే అవకాశం ఉంది. మిగిలిన విద్యార్థులు రేకుల వరండా, చెట్ల కింద కూర్చుని చదువుతున్నారు. ఆరుబయట నేలపై సిమెంట్ తేలిపోయి అక్కడక్కడా గుంతలు ఏర్పడ్డాయి.

రన్నింగ్ వాటర్ లేక అవస్థలు : నీటి సదుపాయం లేక మరుగుదొడ్లు, చేతులు కడుక్కునేందుకు పంచాయతీ కుళాయి నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. తాగునీటికీ అదే పరిస్థితి. స్టీల్‌డ్రమ్‌లో పంచాయతీ వాటర్‌ను నింపి.. దాన్ని ఆరు బయట బెంచ్‌పై పెట్టి వాడుకుంటున్నారు.

నాగరత్నమ్మ కాలనీలో కొత్త భవనం: రెండేళ్ల కిందట నాడు-నేడులో రెండో దశలో ఈ పాఠశాలను ఎంపిక చేసి నాగరత్నమ్మకాలనీలో కొత్త భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇందుకోసం రూ.44 లక్షలు మంజూరు చేశారు. ఇప్పటివరకు రూ.24లక్షలు ఖర్చు చేశారు. నిధుల కొరతతో పనులు నత్తనడకన సాగుతున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే పులివర్తి నానీ చొరవతో ఇటీవల పనులను తిరిగి ప్రారంభించారు.

శ్రీవారిసేవలో హిమాచల్‌ప్రదేశ్ డిప్యూటీ సీఎం


ముఖేష్ అగ్నిహోత్రి

తిరుమల, నవంబరు15(ఆంధ్రజ్యోతి): హిమాచల్‌ప్రదేశ్ డిప్యూటీసీఎం ముఖేష్ అగ్నిహోత్రి శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ముఖేష్ అగ్నిహోత్రికి రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

అమ్మవారి సేవలో శృంగేరి శారదపీఠం ఉత్తరాధికారి



తిరుచానూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని శుక్రవారం శృంగేరి శారదపీఠం ఉత్తరాధికారి విదుశేఖర భారతి తీర్థస్వామిజీ శిష్యబృందంతో దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మదనమోహన్‌రాజు సేవలు మరువలేనివి

భాకరాపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతిపై ఎర్రావారిపాళెం మండల పరిషత్ పరిపాలనాధికారిగా వెళుతున్న మదనమోహన్ రాజు సేవలు మరువలేనివని ఎంపీడీవో గిడ్డయ్య ప్రశంసించారు. దాదాపు 17 సంవత్సరాలు వివిధ పంచాయతీల కార్యదర్శిగా పనిచేయడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష పత్రాల అందజేత

రామచంద్రాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలంలో గత ఖరీఫ్ సీజన్‌లో భూసార పరీక్షలు నిర్వహించారు. వీటిని శుక్రవారం గంగిరెడ్డిపల్లి రైతు సేవాకేంద్రంలో వ్యవసాయాధికారి స్రవంతి రైతులకు అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.64 కోట్లు

తిరుమల, నవంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.64 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ శుక్రవారం ఉదయం ప్రకటించింది. గురువారం 56,711 మంది భక్తులు దర్శించుకున్నారు. 56,711 మంది తలనీలాలు సమర్పించారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ

శ్రీకాళహస్తి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం రాత్రి పౌర్ణమిని పురస్కరించుకుని ఊంజల్‌సేవ నేత్రపర్వంగా సాగింది. మొదట ఆలయంలోని అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఉత్సవమూర్తులకు పలు అభిషేక పూజలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠింపజేసి ఊంజల్‌సేవ మండపానికి తీసుకువచ్చారు. పౌర్ణమి వెండి కాంతుల్లో ఊంజల్‌సేవలో ఊయల ఊగుతున్న స్వామిఅమ్మవార్లను భక్తులు దర్శించు కున్నారు. ఆలయ ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు

● భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు


సూరినేనివారిపల్లె శివాలయంలో లక్ష కుంకుమార్చన


పరాశరేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

చంద్రగిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాలు కిటకిటలాడాయి. తొండవాడలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాల్లో శుక్రవారం రాత్రి శివపార్వతులు నందీ వాహనంపై దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, ఆనందవల్లిదేవికి అభిషేకం చేసి విశేషంగా అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి ఉత్సవ వమూర్తులను నంది వాహనంపై అధిష్ఠించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు. చంద్రగిరిలోని శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయంలో (పుట్టాలమ్మ ఆలయం) స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. ●పాకాల: ఉప్పరపల్లె పంచాయతీ సూరినేనివారిపల్లె శివాలయంలో విశ్వశాంతి కోరుతూ ఉదయం గణపతిపూజ, గోపూజ, ఐదు జీవనదుల గంగా జలాలతో రుద్రాభిషేకం, బిల్వార్చన, లలితా పరమేశ్వరీదేవి లక్ష కుంకుమార్చన, అన్నాభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం జ్యోతిర్లింగ సహస్ర దీపాలంకరణ, చలిపిండి దీపాలతో ఆలయ ప్రదర్శన, రాత్రి కోలాట భజననిర్వహించారు. ●ఎర్రావారిపాలెం: తలకోన సిద్ధేశ్వరస్వామి ఆలయం శివనామ స్మరణతో మారుమోగింది. ఉదయం అర్చన,అభిషేకానంతరం అన్నాభిషేకోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.. సాయంత్రం కార్తీక దీపోత్సవం జరిగింది. ఆలయ ఈఓ మమత ఏర్పాట్లు పర్యవేక్షించారు. ●తిరుచానూరు: యోగిమల్లవరంలోని పరాశరేశ్వరస్వామి ఆలయంలో. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. వేకువజామునుంచి రాత్రి వరకు భక్తులు భక్తులు దర్శించుకున్నారు. మహిళు కార్తీక దీపాలు వెలిగించారు. ●రామచంద్రాపురం: రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం పుష్కరిణి వద్ద మహిళలు కార్తీక దీపాన్ని వెలిగించారు.


అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో దీపారాధన


తలకోన శివాలయంలో భక్తుల పూజలు

పంటపొలాలపై ఏనుగుల విధ్వంసం



ధ్వంసమైన కాకర పంట మధ్య బాధిత రైతు

పాకాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పదిపుట్లబైలు పంచాయతీ పుల్లావాండ్లపల్లె పరిసరాల్లో గురువారం రాత్రి ఏనుగులు పంటపొలాలపై దాడి చేశాయి. విధ్వంసం సృష్టించాయి. కొబ్బరిచెట్లను విరిచేశాయి. కాకర, అరటి, వంకాయ, పంటలను తొక్కేశాయి. చేతికి వచ్చే సమయంలో పంటలను ధ్వంసం చేయడంతో పలువురు రైతులకు నష్టం వాటిల్లింది. ఏనుగులు వరుస దాడులు చేసి నష్టం కలిగిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగులను అటవీ ప్రాంతాలకు తరలించి, నష్టపోయిన పంటకు ఆర్థిక సాయం చేయాలని వీరు కోరుతున్నారు. వల్లివేడు, చంద్రయ్యగారిపల్లె, ఈపాలగుట్టపల్లె, పదిపుట్లబైలు, పేరసానిపల్లె పరిసరాల్లో ఏనుగులు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి.

భూ ఆక్రమణ ఘటనలో టీడీపీ నేతపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని తుంగా బాలకృష్ణ భూమిని ఆక్రమించి గుడిసె వేశారనే ఫిర్యాదుపై తిరుపతి నగర టీడీపీ నేత జేబీ శ్రీనివాస్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా చిట్వేలు మండలం తుమ్మచెర్లపల్లికి చెందిన తుంగా బాలకృష్ణ 1996లో సర్వే నెంబరు 249-4,5లో 1.36 ఎకరాల భూమిని పొట్టియ్య మరికొంతమంది నుంచి రిజిస్టర్ డాక్యుమెంటు ద్వారా కొనుగోలు చేశారు. గతంలో కొందరు ఈ భూమిని ఆక్రమించుకుని ఉంటే బాధితుడు హైకోర్టును ఆశ్రయించగా.. బాలకృష్ణకు అనుకూలంగా తీర్పు వచ్చిందని సీఐ చెప్పారు. కానీ, హైకోర్టు ఉత్తర్వులను ఖాతరు చేయని భూ ఆక్రమణ దారులు టీడీపీ నేత జేబీ శ్రీనివాస్, భాస్కరనాయుడు, దాదాపు 20 మంది కలిసి బాలకృష్ణ భూమిలోకి దౌర్జన్యంగా ప్రవేశించి గుడిసెలు వేసుకుని భయభ్రాంతులకు గురి చేసి సెప్టెంబరు 22న ఆక్రమించుకున్నారని చెప్పారు. దీనిపై అదే రోజు బాధితుడు తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై విచారణ చేసిన అనంతరం శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చిన్నగోవిందు చెప్పారు.

చెర్లోపల్లె టు మంగాపురం రహదారి నిర్మాణానికి పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

తిరుపతి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలో టీటీడీ నిధులతో చేపట్టనున్న చెర్లోపల్లె సర్కిల్ నుంచి మంగాపురం సర్కిల్ వరకు నాలుగులేన్ల రహదారి(డబుల్‌లేన్) నిర్మాణానికి శుక్రవారం టీటీడీ ఇంజినీరింగ్ విభాగ అధికారులు స్థల పరిశీలన చేశారు. రూ.25కోట్లతో 3.3కి.మీ వరకు రెండువైపులా కలసి 16మీటర్ల వెడల్పుతో ఈ రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రహదారి నిర్మాణానికి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి, పుదిపట్ల పంచాయతీ పరిధిలో కొంతదూరం వరకు వైట్‌మిక్స్(గ్రావెల్)ను నింపి చదును చేశారు. కాగా అటవీశాఖ నుంచి పూర్తిస్థాయి అనుమతి రాకపోవడం, ఎలక్ట్రికల్ లైన్ల సమస్యతో కొంతకాలం ఈ పనులను నిలుపుదల చేశారని సమాచారం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అటవీశాఖ అనుమతితో రహదారి పొడవునా ఉన్న చెట్ల తొలగింపు చేపడుతున్నారు. శుక్రవారం టీటీడీ ఈఈ ప్రసాద్, డీఈ దామోదరం నేతృత్వంలో రహదారి పరిశీలన చేపట్టారు. కాగా, తిరుమల శ్రీవారిని దర్శించుకున్న పలువురు భక్తులు శ్రీనివాసమంగాపురానికి సైతం వస్తుంటారు. రోడ్డు సరిగా లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నారు. త్వరగా విస్తరణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

స్వామిని చూసిన ప్రతిసారి మర్చిపోతుంటా

● హీరో విశ్వక్‌సేన్


విశ్వక్‌సేన్ -అదితి గోవిత్రికర్

తిరుమల, నవంబరు15(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామిని చూసిన ప్రతిసారి కోరుకోవాలనుకున్న కోరికలన్నీ మర్చిపోతుంటానని యువ హీరో విశ్వక్‌సేన్ అన్నారు. తిరుమలకు గురువారం రాత్రి కాలినడకన వచ్చిన ఆయన శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది మూడోసారి.. మూడో సినిమా విడుదల సందర్భంగా స్వామి ఆశీస్సులు తీసుకునేందుకు తిరుమలకు వచ్చానన్నారు. 22న 'మెకానిక్ రాకీ' విడుదల కానుందన్నారు. అందుకే స్వామిని దర్శించుకుని ఆశీర్వాదాలు తీసుకున్నట్లు తెలిపారు. అంతకు ముందు పవన్‌కల్యాణ్ 'తమ్ముడు' హీరోయిన్ నటి అదితి గోవిత్రికర్ దర్శించుకున్నారు.

శృంగేరి శారదపీఠం ఉత్తరాధికారిని కలిసిన ఈవో


విదుశేఖర భారతి తీర్థ స్వామిజీ ఆశీర్వచనం తీసుకుంటున్న ఈవో శ్యామలరావు

తిరుమల, నవంబరు15(ఆంధ్రజ్యోతి): శృంగేరి శారదపీఠం ఉత్తరాధికారి విదుశేఖర భారతి తీర్థ స్వామిజీని టీటీడీ ఈవో శ్యామలరావు మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతిలోని శృంగేరి శంకర పీఠానికి ఈవో దంపతులు శుక్రవారం వెళ్లారు. ఈవో దంపతులను స్వామిజీ సత్కరించి ఆశీర్వాదం అందించారు. సనాతన ధర్మవ్యాప్తిని, వేద పరిరక్షణ, వేద వ్యాప్తికి టీటీడీ చేపడుతున్న కార్యక్రమాలను స్వామిజీకి ఈవో వివరించారు.

సంపద సృష్టించేలా రాష్ట్ర బడ్జెట్ రూపకల్పన



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ మునిరత్నం నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సంపదను సృష్టించే లక్ష్యంతో రాష్ట్ర బడ్జెట్ రూపకల్పన చేసినట్లు ఉందని ఎస్వీయూ ఎకనమిక్స్ రిటైర్డు ప్రొఫెసర్ మునిరత్నం నాయుడు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర బడ్జెట్‌పై ఎకనమిక్స్ విభాగం సెనేట్ హాల్లో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడానికి ఈ బడ్జెట్ ఉపయోగపడుతుందన్నారు. ఆర్థిక స్థితిగతులను సరిదిద్దేందుకు ఇతర మార్గాలను కూడా అన్వేషించినట్లు బడ్జెట్‌ను బట్టి అర్థమవుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించడం మంచి పరిణామమని వివరించారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో గొప్ప మార్పులు తీసుకొచ్చే విధంగా బడ్జెట్ ఉందని అన్నారు. ఉన్నత విద్యారంగాన్ని ఉన్నత దశకు బడ్జెట్ దోహదం చేస్తుందన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించడం సత్ఫలితాలను ఇస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రిన్సిపాల్ సుధారాణి, ఎకనమిక్స్ హెడ్ సునీత, అధ్యాపకులు రాధిక, పరదేశి, సుదర్శనరెడ్డి, ప్రతాప్, శివ, గీత, సుబ్రమణ్యం, కుమార్‌రాజా, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్తు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చదువుతోనే మంచి భవిష్యత్తు లభిస్తుందని, గిరిజన విద్యార్థులు ఆ దిశగా విద్యలో రాణించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. బిర్సా ముండా జయంతి సందర్భంగా నగరంలోని గిరిజన భవన్‌లో శుక్రవారం స్వాభిమాన ఉత్సవాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమం కోసం బిర్సాముండా అనేక త్యాగాలు, పోరాటాలు చేశారని తెలిపారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని గిరిజన విద్యార్థులు అభివృద్ధిలోకి రావాలన్నారు. విద్యార్థులు, గిరిజన సంఘాలు బాల్య వివాహాల నిర్మూలన దిశగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని గిరిజన వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్య శంకర్‌నాయక్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను గిరిజన కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు బిర్సాముండా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పదవుల్లో రజకులకు అవకాశం కల్పించండి



సీఎం చంద్రబాబుకు సమస్య విన్నవిస్తున్న లక్ష్మయ్య

తిరుపతి (జీవకోన), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నామి నేటెడ్ పదవుల్లో రజకులకు అవకాశం కల్పించాలని రాష్ట్ర రజక జనసేవ సంఘం అధ్యక్షుడు, బీసీ నేత అక్కినపల్లి లక్ష్మయ్య సీఎం చంద్రబాబుకు విన్నవిం చారు. ఈ మేరకు విజయవాడలో సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. చట్టసభల్లో రజకులకు గౌరవం దక్కే విధంగా ఎమ్మెల్యేగా గల్లా మాధవి, ఎమ్మెల్సీగా దువారపు రామారావుకు అవకాశం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నామినేటెడ్ పదవుల్లోనూ అవకాశం కల్పించాలని కోరారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు లక్ష్మయ్య పేర్కొన్నారు. సీఎంను కలిసిన వారిలో ఏపీ రజక కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ నారాయణ ఉన్నారు.

స్వర్ణాంధ్ర విశ్వబ్రాహ్మణ సేవా సమితి నూతన కార్యవర్గం



ఐక్యత చాటుతున్న విశ్వబ్రాహ్మణులు

తిరుపతి అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విశ్వబ్రాహ్మణ సేవా సమితి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం స్థానిక యూత్ హాస్టల్లో ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేజర్ల మనోహరాచారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా అధ్యక్షుడిగా గంటికోవెల తిరుమలాచారి, క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గా రామచంద్ర, తిరుపతి నగరాధ్యక్షుడిగా శ్రీమంతుల రామయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియామక పత్రాలను అందజేశారు. తమ న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

రజక కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



కరాటే చంద్రను సత్కరిస్తున్న మహేష్ యాదవ్ తదితరులు

తిరుపతి, నవంబరు15 (ఆంధ్రజ్యోతి) : రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన కరాటే చంద్రను టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఎస్వీఎం శ్రీధర్, రూపేష్, జిమ్ ప్రకాష్, దాము, నారాయణ, శరత్‌లు శుక్రవారం శ్రీవారి చిత్రపటం, శాలువాతో సత్కరించారు.

సీఎంకు నాయీ బ్రాహ్మణుల కృతజ్ఞతలు



సదాశివంను సన్మానిస్తున్న కడప జిల్లా నాయీ బ్రాహ్మణ నాయకులు

తిరుపతి, నవంబరు15 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమ ప్రాంతానికి చెందిన రుద్రకోటి సదాశివంను రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమాభివృద్ధి ఛైర్మన్‌గా నియమించిన సందర్భంగా కడప జిల్లాకు చెందిన నాయీ బ్రాహ్మణ సంఘాల నాయకులు సీఎం చంద్రబాబు, యువనేత, మంత్రి లోకేశ్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం కడప జిల్లా నాయకులు గురుస్వామి, మద్దిలేటి, రంగయ్య, సుబ్బరాయుడుల ఆధ్వర్యంలో కేవీ రమణ, నాగరాజు, సురేష్, బాబు, వెంకటరమణ, సహదేవ, సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్యలు కొర్లగుంటలోని రుద్రకోటి నివాసానికి చేరుకుని ఘనంగా సన్మానించారు.

సీబీఎస్ఈ జాతీయ పోటీలకు ఎంపిక



తిరుపతి(విద్య), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఇటీవల జరిగిన రీజనల్ సైన్స్ ఎగ్జిబిషన్ (సీబీఎస్ఈ) పోటీలలో సమస్యను గుర్తించి, దానికి శాస్త్రీయ పరిష్కారం చూపడంలో స్థానిక బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ 8వ తరగతి విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రాజెక్ట్ హెడ్ ఎం.సతీష్ తెలిపారు. బి.కేతన్‌క్రిష్, సి.బాలాదిత్యలు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు.

ఈ-పంట నమోదు చేయాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటలను ఈ-పంటలో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. జిల్లా అధికారులతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ సాగులోని బంజరు భూములను ప్రత్యేకంగా నమోదు చేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఈ-పంట నమోదులో రైతు పంట వివరాలు తీసుకున్న ఫొటోలు స్పష్టంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్ ధనంజయరెడ్డి పాల్గొన్నారు.

కేసుల కొట్టివేతపై హర్షం

తిరుపతి అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగులపై నమోదు చేసిన కేసులను కొట్టివేస్తున్నట్లు అసెంబ్లీలో మంత్రి లోకేశ్ ప్రకటించినందుకు ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ చీర్ల కిరణ్ హర్షం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని 2022 సెప్టెంబరు ఒకటిన ఛలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొన్న వేలాది మందిపై కేసులు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అసెంబ్లీ సాక్షిగా శుక్రవారం వెలువడిన ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల తరపున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ అధ్యాపకులకు సత్కారం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ అధ్యాపక అవార్డులు పొందిన ఎస్వీయూ ప్రొఫెసర్లు రాజశేఖర్ (జువాలజీ), సుచరిత (హోంసైన్స్)లను ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సత్కరించారు. అధ్యాపకుల కృషిని ప్రభుత్వం గుర్తించి గౌరవించిందన్నారు.

పోసానిని అరెస్టు చేయాలి



పోసాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జన సైనికులు

తిరుపతి అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు పోసాని కృష్ణమురళిని తక్షణమే అరెస్టు చేయాలని జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు బత్తెన మధుబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక ఆర్టీసీ బస్టాండుకు సమీపంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద పోసాని దిష్టిబొమ్మను దహనం చేసి, నిరసన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడులపై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. అనంతరం ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. జన సైనికులు హిమవంతు రాయల్, వంశీసాయి, హరికృష్ణపాల్గొన్నారు.

రాస్ కార్యాలయంలో వేడుకగా కార్తీక దీపోత్సవం



తిరుపతి (ఆటోనగర్) నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ సేవా సమితి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం పొదుపు సంఘాల డైరెక్టర్ వి.నాగరాజు అధ్వర్యంలో కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. సిబ్బంది భక్తి భావంతో పిండి, ఉసిరి దీపాలు వెలిగించి భక్తి చాటుకున్నారు. నాగరాజు కార్తీక మాసంలో దీపోత్సవం ప్రత్యేకత గురించి వివరించారు. అనంతరం సిబ్బందికి ప్రసాదాలు పంపిణీ చేశారు.

జూడో పోటీల్లో ప్రతిభ

తిరుపతి(క్రీడలు), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన అంతర్ కళాశాల మెన్ జూడో పోటీలో పలువురు విద్యార్థులు సత్తా చాటారు. ఎం.డి.మల్లికార్జున, ఎస్.హరి, కె.పార్థసారధి ఆర్.గణేష్, (ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ), బి.వంశీనాయక్(సీకాం కాలేజీ), పి.నందకుమార్(ఎస్వీఎస్ కాలేజీ), సీహెచ్.గోవిందన్(ఎస్వీయూ కాలేజీ)లు విజేతలుగా నిలిచారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫ్యాకల్టి డాక్టర్ నరసింహారావు, ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి, కోచ్ ఈ.గోపి చేతుల మీదుగా విజేతలకు పతకాలు అందజేశారు.

నేటి నుంచి నాటకోత్సవాలు

తిరుపతి(లీలామహల్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహతి కళాక్షేత్రంలో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు పౌరాణిక నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు ఫైన్ ఆర్ట్స్ అధ్యక్షుడు కస్పా పద్మనాభన్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో శ్రీపద్మనాభ నేషనల్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ 20వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కళాకారులు, కళాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అంతా శివమయం..!

- శివాలయాల్లో కార్తీకపౌర్ణమి రద్దీ
- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



కపిలతీర్థం కోనేరులో భక్తుల రద్దీ , కపిలతీర్థంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

తిరుపతి(కల్చరల్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం కపిలతీర్థంలోని శివాలయం సందడిగా మారింది. స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించారు. ఉదయం 2 గంటలకు సుప్రభాతంతో కపిలేశ్వర స్వామి మేల్కొలుపు చేశారు. 2.30నుంచి వేకుమజాము 4.30 గంటల వరకు అభిషేకం, అలంకారం, పూజ, అర్చన నిర్వహించారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏకాంతంగా అన్నాభిషేకం, దీపారాధన చేశారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య భక్తులకు అన్నలింగ దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఏకాంతంగా అన్నలింగ ఉద్వాసన, 7 నుంచి 8 గంటల వరకు సుగంధద్రవ్య అభిషేకం ఏకాంతంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి పుష్కరిణిలో అన్న విగ్రహాలకు పూజలు నిర్వహించారు. రద్దీకి తగ్గట్టుగా టీటీడీ ఏర్పాట్లు చేపట్టింది. డిప్యూటి ఈవో దేవేంద్ర బాబు పాల్గొన్నారు.

మంచినీళ్లగుంట శివాలయంలో..

శృంగేరి శారదా పీఠం ఆధ్వర్యంలో మంచినీళ్లగుంట కాశీవిశ్వేశ్వరాలయంలో శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. విశ్వేశ్వరుడికి శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి అన్నాభిషేకం నిర్వహించారు. భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు విధుశేఖర భారతి స్థానిక రాములవారి గుడి ఉత్తరమాడ వీధిలో ఉన్న శారదా మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో రాళ్లపల్లి రామమూర్తి, జీఎల్ మోహన్ పాల్గొన్నారు.



మల్లికార్జునస్వామి ఆలయంలో..

తిరుపతి రూరల్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఎల్ఎస్‌నగర్‌లోని భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమిని వైభవంగా నిర్వహించారు. ఉదయం 4-6 గంటల వరకు స్వామి వారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం 7-7.30 గంటల వరకు జ్వాలాతోరణం, జ్వాలాహారతి నిర్వహించారు. 9 గంటలకు ఏకాంతసేవ నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. ఆలయ ధర్మకర్తలు ఎ.జంగారెడ్డి, ఎ.ఉమాపతిరెడ్డి, ఉమామహేశ్వరరావు, బాలయ్య, సుబ్బారావు, మేనేజర్ లీలాప్రకాశ్, ప్రధాన అర్చకుడు ధర్మేంద్రస్వామి, అర్చకులు దివాకర్, వంశీ పాల్గొన్నారు.

వైభవంగా మహా చండీహోమం



తిరుపతి(కల్చరల్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరిం చుకుని తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శుక్రవారం మహా చండీహోమం నిర్వహించారు. ఉదయం 8.45 నుంచి 11.45 గంటల వరకు హోమక్రతువు జరిగింది. పూర్ణాహుతితో ముగిసింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. తీర్థ, ప్రసాదాలు అందజేశారు. టీడీపీ నేతలు ఆర్సీ మునికృష్ణ, జయకుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఈవో జయకుమార్ పాల్గొన్నారు.

కెనరాబ్యాంకు సేవలు విస్తరిస్తున్నాం

ఎండీ సత్యనారాయణరాజు



సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణరాజు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ రంగంలో సరికొత్త ఆలోచనలతో కెనరా బ్యాంకు సేవలను విస్తరిస్తున్నామని, తద్వారా ప్రజలకు మరింత చేరువవుతుందని బ్యాంకు ఎండీ, సీఈవో సత్యనారాయణరాజు తెలిపారు. ఎమ్మార్‌పల్లె పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ఏర్పాటు చేసిన కెనరా బ్యాంక్ సర్కిల్ కార్యాలయ సముదాయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. తిరుపతిలో ఇప్పటివరకు రీజనల్ బ్యాంకు మాత్రమే ఉండేదని, ప్రస్తుతం సర్కిల్ ఆఫీసు ఏర్పాటు చేశామని చెప్పారు. డబుల్ డిజిట్ గ్రోత్ సాధించి గత సెప్టెంబరులో రూ.4వేల కోట్ల లాభం ఆర్జించామన్నారు. నూతన పథకాల ద్వారా ప్రామాణికమైన వడ్డీరేట్లతో రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా మరో 250 బ్రాంచ్‌లను ఏర్పాటు చేయదలచామని వెల్లడించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు పాండురంగ, రామనాయక్, రవికృష్ణ, సత్యప్రకాష్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న జనార్దననాయుడు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా కె.జనార్దననాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలం, కల్లావారిపల్లెకు చెందిన ఆయన 1991 బ్యాచ్‌లో పోలీసు శాఖకు ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం 1992-2003 వరకు కడప జిల్లాలో ఎస్ఐగా పనిచేశారు. 2004లో సీఐగా పదోన్నతి పొంది తిరుపతి, కర్నూలు జిల్లాలో ఏసీబీ సీఐగా 2014 వరకు పనిచేశారు. 2014లో డీఎస్పీగా పదోన్నతి పొంది 2019 వరకు తిరుపతి ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేశారు. 2019 నుంచి 2023 వరకు తిరుపతి ఏసీబీ డీఎస్పీగా విధు నిర్వర్తించారు. తర్వాత నందిగామ ఏసీపీగా కొంతకాలం పనిచేశారు. గత ఆగస్టులో ఏఎస్పీగా పదోన్నతి పొంది నంది గామలో పనిచేసిన ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి ఎస్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారిగా నియమించింది. బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఎస్పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.

విజ్ఞాన గనులు గ్రంథాలయాలు



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న దృశ్యం


తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన గనులని డీఈఓ కేవీఎన్ కుమార్ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అన్నమయ్య సర్కిల్‌లో ఉన్న తిరుపతి గ్రేడ్-1 గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ అధికారి శివప్రసాద్ అధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. డీఈవో మాట్లాడుతూ పుస్తకం మంచి నేస్తమన్నారు. ఒక మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానమన్నారు. విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానాన్ని పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లిష్ ట్రైనర్ గోపాల్, సపోర్టు చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ తహసున్నీసాబేగం, రచయిత ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, వంకలను కాపాడండి



జేసీ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భూకబ్జాదారుల నుంచి చెరువులు, కుంటలు, వాగులు, కాలువలు, స్వర్ణముఖి నది తీర ప్రాంతాన్ని కాపాడాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జేసీ శుభం బన్సల్‌ను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తిరుపతి, తిరుపతి రూరల్ పరిధిలో భూముల విలువ ఎక్కువగా ఉండడంతో అధికార, ప్రతిపక్ష పార్టీల వారు కబ్జా చేస్తున్నారన్నారు. యోగిమల్లం 1/1, 1/2 సర్వే నెంబరుగల చెరువును కొందరు ఆక్రమించు కుని ఇల్లు నిర్మిస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు సహకరించి పట్టాలు ఇస్తున్నారని తెలిపారు. పద్మావతీపురం చెరువు 120 ఎకరాలు ఉండగా పూర్తి స్థాయిలో ఆక్రమణకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటాపురం, మంగళం చెరువులు కూడా కబ్జాదారులు ఆక్రమించుకున్నారని తెలిపారు. తిరుపతి నడిబొడ్డున ఉన్న పాన్ చెరువు పూర్తిగా ఆక్రమణకు గురైందని చెప్పారు. బఫర్ జోన్ వదలకుండా హోటళ్లు కడుతున్నా అధికారులు అటువైపు చూడటం లేదని తెలిపారు. స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలోనూ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర, డాక్టర్ సాయిలక్ష్మి, తిరుచానూరు కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ సుమన్ పాల్గొన్నారు.





ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME

I, Shaik Rahana (Old name), W/o Shaik Babu R/o 1-9, Nernipalli Village, V.Kota Mandal, Chittoor Dist, A.P. PIN-517424,. Hence forth my name has been changed to SHAIK RIHANAA (New name)
AJT-4714

CHANGE OF NAME

I, YELLANTI GOWTHAM S/o YELLANTI RAVEENDRA REDDY Residing at 000, Chinna Darga Road, Naidupeta (P&M) - 524126, TIRUPATI (Dist), A.P. Hence I state That My Name has been Changed from YELLANTI GOWTHAM REDDY (My Old Name) to YELLANTI GOWTHAM (My New Name).
AJT-4712

CHANGE OF NAME

I, Moinuddin Nasiruddin (old name), S/O M.A.S.Mayunuddian R/O # 9/12, Besides KPS Main Gate, Chinnakurlapalli, Kuppam Mandal, Chittoor Dist, A.P. PIN-517425, Hence forth my name has been changed to Mayunuddian Nasiruddin (New name)
AJT-4715

WANTED

ప్రకృతి ఇన్‌ఫ్రాలో పనిచేయుటకు, Receptionist టెలికాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర.: రామానుజ సర్కిల్, SBI U/s 2nd ఫ్లోర్, తిరుపతి. సెల్ : 97411 63131.
AJT-4711

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(ట్రైబ్యు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర 7382114647
AJA-198468

TOURS&TRAVELS

42 years experience సాయికళ టూర్స్ & ట్రావెల్స్ మదనపల్లె 1) సింగపూర్, మలేషియా 5N/6D, 80,000/- తేదీ: 20-01-25, 2) శ్రీలంక 6N/7D, 52,220/- తేదీ: 27-01-25, సం.ప్ర. సెల్: 94403 59204
AJT-1151

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి



కపిలతీర్థంలో
వేడుకగా అన్నాభిషేకం

తిరుపతిలోని కపిలతీర్థంలో శుక్రవారం స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏకాంతంగా అన్నాభిషేకం, దీపారాధన చేశారు. ఈ ఉపచారాలన్నీ అర్చకస్వాములే ఏకాంతంగా నిర్వహించడం విశేషం. భక్తులు ఎవరికీ ప్రవేశంలేదు. సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య భక్తులకు అన్నలింగదర్శనం కల్పించారు. రాత్రి 8 గంటల తర్వాత పుష్కరిణిలో అన్నవిగ్రహాలకు పూజలు నిర్వహించారు.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

అన్నాలంకారంలో వాల్మీకేశ్వరుడు

నాగలాపురం మండలం సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా అన్నాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ పరివార దేవతా మూర్తులకు ప్రత్యేక అభిషేకాదికార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మూలమూర్తి వాల్మీకేశ్వరస్వామిని దాతలు అందించిన అన్నంతో అలంకరించి అన్నాభిషేకాన్ని నిర్వహించారు. స్వామివారి సన్నిధిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. అభిషేకించిన కొంత అన్నాన్ని భక్తులకు ప్రసాదంగా పంచిపెట్టారు. అనంతరం అరుణా నదిలో అన్నాన్ని నిమజ్జనం చేశారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో లత పర్యవేక్షించారు.

- నాగలాపురం, ఆంధ్రజ్యోతి





కపిలతీర్థంలోని శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



తిరుపతి నరసింహతీర్థం రోడ్డులోని శివాలయం వద్ద..



కపిలతీర్థం జలపాతం వద్ద సందడి

సందడిగా కపిలతీర్థం



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం తిరుపతిలోని కపిలతీర్థం సందడిగా మారింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల శివనామ స్మరణతో మార్మోగింది. కపిలతీర్థం కూడలి వద్ద పోలీసులు భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వాహనాలు ఆపుతూ రోడ్డు దాటించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని బస్టాండు నుంచి వచ్చే వాహనాలను ప్రకాశం పార్కు నుంచి రుయాస్పత్రి మీదుగా దారి మళ్లించారు. సాయంత్రం ఇక్కడితో పాటు శివాలయాల్లో కార్తీక దీపాలు వెలగించారు.

- తిరుపతి(కపిలతీర్థం), ఆంధ్రజ్యోతి



పుష్కరిణిలో భక్తుల సెల్ఫీ



కార్తీకదీపం వెలిగిస్తూ..

యోగుల కొండపై..

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం వడమాలపేట మండలం యోగుల కొండపై కొప్పెర దీపాన్ని వెలిగించారు. 1503 కిలోల నెయ్యితో, ఆరు అడుగుల కొప్పెర దీపాన్ని ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి వెలిగించారు. దీప దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి





తిరుమలలో కార్తీక దీప వెలుగులు

తిరుమల శ్రీవారి ఆలయ ప్రాంతం శుక్రవారం కార్తీక దీప వెలుగులను సంతరించుకుంది. గరుడ వాహనసేవను కూడా నిర్వహించిన క్రమంలో తిరుపతి, తిరుమల స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అఖిలాండం వద్ద నేతి దీపాలను వెలిగించి పూజలు చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నాయుడుపేట వద్ద స్వర్ణముఖినది వద్ద..







శ్రీకాళహస్తీశ్వరాలయ ఆవరణలో..., శ్రీకాళహస్తి వద్ద స్వర్ణముఖి నదిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

స్వర్ణముఖి నదిలో కార్తీక దీపాలు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ముక్కంటి ఆలయ రెండో గేటు వద్ద భక్తులు పెద్దసంఖ్యలో నేతి దీపాలను వెలిగించి ముక్కంటికి అర్పించారు. పుణ్య స్వర్ణముఖి నదిలో దీపాలు వెలిగించి గంగాదేవికి సమర్పించారు. ముక్కంటి ఆలయ పరిసరాలు, స్వర్ణముఖినదీ తీరప్రాంతం ఎటు చూసినా నేతి దీపపు కాంతులతో ఆధ్యాత్మిక ప్రకాశించింది. శుక్రవారం సుమారు 30వేలమంది భక్తులు దర్శించుకుంటున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

ఇసుక సరఫరాకు
దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇసుక సరఫరాకు ప్రైవేటు ఏజెన్సీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్కువ పరిమాణంలో ఇసుక వినియోగించే వారి కోసం జిల్లాలో మూడుచోట్ల డిపోలను ప్రైవేటు ఏజెన్సీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. తిరుపతి అర్బన్‌కు సంబంధించి కాటన్‌మిల్ వద్ద(టన్ను ధర రూ.640), రేణిగుంటకు గాజులమండ్యం వద్ద (రూ.675), తిరుపతి రూరల్‌కు అవిలాల వద్ద(రూ.635) ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్ణయించిన ధరలకు ఇసుక అమ్మాల్సి ఉంటుందని వివరించారు. ఆసక్తిగలవారు ఈనెల 20వ తేది సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మరిన్ని వివరాలకు 9100688839ను సంప్రదించవచ్చునని ఆయన పేర్కొన్నారు.

22 కిలోల గంజాయి స్వాధీనం
ఇద్దరి అరెస్టు



అలిపిరి పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో శుక్రవారం వేర్వేరుగా చోట్ల 49 కిలోల గంజాయి పట్టుకున్నారు. నగర పరిధిలోని ఆటోనగర్‌లో అలిపిరి పోలీసులు 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. నగర డీఎస్పీ వెంకటనారాయణ కథనం మేరకు.. చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం గాజులపల్లికి చెందిన మాదరపు మాధవ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చంద్రగిరి మండలం నరసింగాపురానికి చెందిన తోటి సందీప్‌తో కలిసి తిరుపతిలోని అలిపిరి, ఆటోనగర్‌ను కేంద్రంగా చేసుకుని గంజాయి విక్రయిస్తున్నారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆటోనగర్ బస్టాప్ వద్ద గంజాయి విక్రయిస్తుండగా రహస్య సమాచారం మేరకు అలిపిరి సీఐ రాంకిషోర్ సిబ్బందితో కలసి వెళ్లి పట్టుకున్నారు. మాధవ నుంచి 12 కిలోలు, సందీప్ నుంచి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరినీ అదుపులోకి తీసుకుని, ఆటోను సీజ్ చేశారు. గంజాయి ఎక్కడి నుంచి తెస్తున్నారు? ఎవరు సరఫరా చేస్తున్నారనే వివరాలు త్వరలో వెల్లడిస్తామని డీఎస్పీ చెప్పారు.

నాగలాపురంలో 12 కిలోల పట్టివేత

● ముగ్గురు తమిళనాడువాసులకు రిమాండ్?

నాగలాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తూ పట్టుబడిన కేసులో ముగ్గురు తమిళనాడువాసులను రిమాండుకు తరలించినట్లు సమాచారం. శుక్రవారం నాగలాపురం బైపాస్ రోడ్డులో పోలీసులు నిర్వహించిన నాకాబందీలో అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు తమిళనాడుకి చెందిన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరి నుంచి 12 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితులను సత్యవేడు కోర్టుకి తరలించి రిమాండ్‌కి తరలించినట్లు సమాచారం. దీనిపై పోలీసులు సాయంత్రం 3 గంటలకు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. అయితే సమావేశం రద్దు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి నిందితుల వివరాలను తెలుసుకునేందుకు ఎస్ఐ సునీల్‌కుమార్‌ను సంప్రదించగా, ఆయన నిరాకరించారు.

రైల్వే స్టేషనులో 15.124 కిలోల గంజాయి స్వాధీనం



రైల్వే స్టేషన్‌లో బ్యాగులు తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు

తిరుపతి(నేరవిభాగం/సెంట్రల్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్ లో శుక్రవారం జీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్ దళాలు నిర్వహించిన 'ఆపరేషన్ నార్కోస్' సక్సెస్ అయింది. లగేజీ కౌంటర్లు, పార్శిల్ కార్యాలయాలు, వివిధ రైళ్లు, ప్లాట్‌ఫారాలపై ఏకకాలంలో తనిఖీలు చేపట్టి రూ.3.78 లక్షల విలువ చేసే 15.124 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి స్టేషన్ నుంచి గంజాయి తరలిపోతుందనే సమాచారంతో జీఆర్‌పీఎఫ్ సీఐ ఆశీర్వాదం, ఎస్ఐలు ధర్మేంద్ర, రాంబాబు, ఏఎస్ఐ మునిరాజ, డాగ్ హ్యాండ్లర్ యానాదిరావు సిబ్బందితో కలసి ఐదారు గంటల పాటు తనిఖీలు చేపట్టారు. నాలుగో ప్లాట్‌ఫారం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు వదలి వెళ్లిన ట్రాలీ, కళాశాల బ్యాగుల్లో గంజాయిని ఆర్‌పీఎఫ్‌కు చెందిన జాగిలం వాయు గుర్తించింది. 15.124 కిలోల గంజాయిని సీఆర్‌పీఎఫ్ బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. గంజాయి, నిషేధిత వస్తువులు కనిపిస్తే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ ఆశీర్వాదం కోరారు. తిరుపతి అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి తనిఖీల్లో పాల్గొన్నారు.

18 నుంచి రేణిగుంట మీదుగా
శబరిమలైకు ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), నవంబరు15 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం సికింద్రాబాదు, మచిలీపట్నం నుంచి కొల్లం మధ్య శబరిమలైకి ఈనెల 18 నుంచి నాలుగు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

● మచిలీపట్నంలో ఈనెల 18, 25 తేదీల్లో ప్రత్యేక రైళ్లు(07145-07146) మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి న్యూగుంటూరు, తెనాలి, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, సేలం, కోయంబత్తూరు, పాల్‌కాడ్ మీదుగా మరుసటి రోజు రాత్రి 9.20 గంటలకు కొల్లంకు చేరుకుంటాయన్నారు. కొల్లంలో ఈనెల 20, 27 తేదీల్లో తెల్లవారుజాము 2.30 గంటలకు బయలుదేరి ఇదే మార్గంలో మరుసటి రోజు ఉదయం 7 గంటలకు మచిలీపట్నం చేరుకుంటాయని వివరించారు.

● ఈనెల 22, 29 తేదీలలో ప్రత్యేక రైళ్లు (07143, 07144) మౌలాలిలో ఉదయం 11.30 గంటలకు బయలుదేరి చర్లపల్లి, జనగామ్, మహబూబాబాద్, డోర్నకల్లు, ఖమ్మం, విజయవాడ, తెనాలి, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, తిరుపూరు, కోయంబత్తూరు, త్రిసూర్, అలువ, ఎర్నాకులంటౌన్, ఎట్టుమనూర్, కొట్టాయం, చెంగనచ్చేరి, తిరువళ్ల, చెంగనూరుల మీదుగా కయన్‌కుళ్లంకు మరుసటి రోజు రాత్రి 7 గంటలకు చేరుకుంటాయి. తిరిగి ఈనెల 24, డిసెంబరు ఒకటో తేదీ కొల్లంలో అర్ధరాత్రి 2.30 గంటలకు బయలుదేరి ఇవే మార్గంలోనే వస్తాయి.

ప్రాణదానం ట్రస్టుకు రూ.50 లక్షల విరాళం



దాత తరపున విరాళం చెక్కును టీటీడీ అదనపు ఈవోకు అందజేస్తున్న సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

తిరుమల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): టీటీడీ ప్రాణదానం ట్రస్టుకు శుక్రవారం రూ.50 లక్షలు విరాళంగా అందింది. బెంగళూరుకు చెందిన బీఎంకె నగేష్ ఈ విరాళం మొత్తాన్ని చెక్ రూపంలో టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేయించారు. ప్రాణదానం ట్రస్టుకు వినియోగించాలని కోరారు.

శ్రీవారికి కానుకగా 15 ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలు



ద్విచక్ర వాహనాల తాళాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేస్తున్న దాత వెంకటనాగరాజ

తిరుమల, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి శుక్రవారం 15 ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలు విరాళంగా అందాయి. హైదరాబాదుకు చెందిన పెరల్ మినరల్స్ అండ్ మైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సి.వెంకట నాగరాజ ఈ 15 టీవీఎస్ ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలను అందజేశారు. ముందుగా వీటికి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాహనాలకు తాళాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి దాత అందజేశారు. ఈ వాహనాల మొత్తం విలువ రూ.22 లక్షలు అని దాత వెల్లడించారు.

నాటు బాంబులు విసిరిన కేసులో
నిందితుడి అరెస్టు

తడ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పోలీసులపైకి నాటు బాంబులు విసిరిన కేసులో తప్పించు తిరుగుతున్న నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. తమిళనాడు రాష్ట్రంలో పాత కేసుల్లో కొందరు నిందితులు ఉన్న కొందరు తడ శివాలయం వెనుక వైపు ఉన్న ఓ ఇంట్లో తలదాచుకున్నట్లు తెలుసుకున్న మధురావాయిల్ పోలీసులు 2021 ఏప్రిల్ 27వ తేదీన ఆ ఇంటిని చుట్టుముట్టారు. ఈ సమయంలో 9 మంది నిందితులు తమిళనాడు పోలీసుల పైకి నాటుబాంబులు విసిరేసి పరారయ్యారు. ఈ కేసుకు సంబంధించి కొంతమందిని అప్పట్లోనే పోలీసులు అరెస్టు చేశారు. చెన్నైలోని మాధవరానికి చెందిన వర్గీస్ జోసెఫ్ తప్పించు తిరుగుతుండగా శుక్రవారం ఉదయం తడ రైల్వేస్టేషన్ వద్ద అతడిని పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడు మీడియాకు వెల్లడించారు. నిందితుడిని కోర్టులోని హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో గూడూరు సబ్ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

పుత్తూరు వార్తలు

అద్దె వసూళ్లలో నిర్లక్ష్యం

- వైసీపీ బినామీల చేతుల్లో అద్దె గదులు, మార్కెట్, జంతువధశాల, ప్రైవేటు బస్టాండ్ లీజులు
- పేరుకుపోయిన రూ.82.35 లక్షల బకాయిలు



మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్

పుత్తూరు అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడింది. రాజకీయ జోక్యం పెచ్చుమీరడం, అధికారులు వారికి వత్తాసు పలకడమే దీనికి కారణం. ఆస్తి పన్నులు, మున్సిపాలిటీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్, దినసరి మార్కెట్, జంతువధ శాల, ప్రైవేటు బస్టాండ్ లీజు ప్రధాన ఆదాయ వనరు. ప్రభుత్వం మారినా పుత్తూరు మున్సిపాలిటీ అధికారుల్లో మార్పు కనిపించడం లేదు. 2017 నుంచి ఇప్పటి వరకు మున్సిపాలిటీకి బకాయిపడ్డ రూ.82.35 లక్షల వసూలులో బకాయిదారులకు నోటీసులు కూడా జారీ చేయకపోవడమే ఇందుకు నిదర్శనం.

షాపింగ్ కాంప్లెక్స్‌లో స్వామిభక్తి...

పుత్తూరు మున్సిపాలిటీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లలో 51 దుకాణాలను అద్దె ప్రాతిపదికన కేటాయించారు. 2017 నుంచి ఇప్పటి వరకు రూ.19.58 లక్షలు అద్దె బకాయి పడ్డారు. ఇందుకు వడ్డీ రూపేణ రూ.11.15 లక్షలు చెల్లించాల్సి ఉంది. షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దె గదుల ద్వారా రూ.34.25లక్షలు బకాయి వసూలు కావాల్సి ఉంది. దీనిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వారి స్వామిభక్తిని తెలుపుతోంది.

మార్కెట్, జంతు వధశాల లీజు...

పట్టణంలోని దినసరి మార్కెట్, జంతువధ శాల, ప్రైవేటు బస్టాండ్‌లను పోటీలేకుండా టెండరు దక్కించుకున్న వైసీపీ పాలకులు అక్రమ వసూళ్లకు తెరలేపారు. కాగా, జంతువధ శాలలో 2021-22కు గాను కాంట్రాక్టర్ నాగేంద్ర బాబు రూ.2.15 లక్షలు, 2022-23కు గాను సునీల్ కుమార్ రూ.4.86 లక్షలు, 2023-24కు గాను ఎస్.సుబ్రమణ్యం 5.42 లక్షలు బకాయి పడ్డారు. అంతే కాకుండా ప్రైవేటు బస్టాండ్‌కు 2022-23కు కాంట్రాక్టర్ చిరంజీవి రూ.9.73 లక్షలు బకాయి చెల్లించాల్సి ఉంది. దినసరి మార్కెట్‌కు 2023-24కు గాను జనార్దన్ రూ.25.92 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలపై వడ్డీ రూ.17.58 లక్షలతో కలిపి మొత్తం రూ.48.10లక్షలు చెల్లించాల్సి ఉంది.

రాజకీయ జోక్యం

ఈ మొండి బకాయిల వసూళ్లకు సంబంధించి న్యాయస్థానంలో దావా దాఖలు చేసేందుకు గత నెల 30న కౌన్సిల్ సమావేశ అజెండాలో పొందపరిచారు. దావా వేసేందుకు కౌన్సిల్ కూడా ఆమోదం తెలిపింది. కౌన్సిల్ సమావేశం జరిగి నేటికి 15 రోజులు కావస్తున్నా అధికారులు దావా దాఖలు చేయలేదు. ఇందుకు పాలకమండలి చైర్మన్ అభ్యంతరం చెబుతుండటమే కారణంగా తెలుస్తోంది. భవిష్యత్తులో తమకు ఎదురయ్యే ఇబ్బందుల దృష్ట్యా అధికారులు మాజీ మంత్రిని ఆశ్రయించినట్లు సమాచారం. సదరు మంత్రి చైర్మన్‌ను ఒప్పించినట్లు సమాచారం. ప్రభుత్వం మారినా, పుత్తూరు మున్సిపల్ కౌన్సిల్‌లో వైసీపీ సభ్యులు మెజారిటీ ఉండటంతో అధికారులు కూడా వారి నిర్ణయాలకు వత్తాసు పలుకుతున్నట్లు విమర్శలున్నాయి.

సారా తయారీపై ఉక్కుపాదం



సారా ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ శాఖ సిబ్బంది (ఫైల్‌ఫొటో)

పుత్తూరు అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పుత్తూరు ఎక్సైజ్ శాఖ పరిధిలో అక్రమాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. శాఖాపరంగా నిబంధనలను అతిక్రమించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. పుత్తూరు సర్కిల్ పరిధిలో నారాయణవనం, పుత్తూరు, వడమాలపేట, రామచంద్రాపురం మండలాలు ఉన్నాయి. నారాయణవనంలో సారా తయారీ జోరుగా సాగుతోంది. ఎక్సైజ్ అధికారులు ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో 2 వేల లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. బెల్టు షాపులపై దాడులు నిర్వహించి ఇప్పటి వరకు 8 మందిపై కేసులు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్, ఏపీ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు మూకుమ్మడిగా దాడులు నిర్వహిస్తున్నాయి. నిబంధలు అతిక్రమించి మద్యాన్ని విక్రయించరాదని స్పష్టం చేస్తున్నారు. అంతే కాకుండా సమయ పాలన తూచా తప్పకుండా పాటించేలా నిఘా ఉంచారు. అలాగే గంజాయి విక్రయాలపై కూడా ఓ కన్నేసి ఉంచారు. మిలటరీ సిబ్బందికి ఇచ్చే మద్యాన్ని విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని, విచారణలో వాస్తవమని తేలితే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

అపార్ కోసం తల్లిదండ్రుల ఆపసోపాలు



ఆధార్ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న విద్యార్థుల తలిదండ్రులు

పుత్తూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన అపార్ నమోదుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆపసోపాలు పడుతున్నారు. నూతన విద్యావిధానంలో జాతీయ స్థాయిలో ప్రతి విద్యార్థికి జీవితకాల గుర్తింపు సంఖ్యతో కార్డు జారీ అవనున్న విషయం విదితమే. ఈక్రమంలో పుత్తూరులో బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఉన్న ఒకే ఒక్క ఆధార్ కేంద్రం వద్ద తెల్లవారుజామున 4 గంటలకే విద్యార్థుల తల్లిదండ్రులు క్యూలో నిలబడి టోకెన్ తీసుకోవాల్సి వస్తోంది. జిల్లా అధికారులు చొరవ తీసుకుని మరో ఆధార్ కేంద్రం, సచివాలయాల్లో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విజ్ఞాన గని గ్రంథాలయం

వడమాలపేట, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన గనులని, ఎక్కువగా పుస్తకాలను చదవడం ద్వారా మేధాశక్తి పెంచుకోవచ్చని గ్రంథాలయ అధికారి ద్రాక్షాయణి పేర్కొన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. పుస్తకాలు, కథలు, కవితలు, నవలలు, వార, దినపత్రికలను అందుబాటులో ఉంచారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి



పుత్తూరు టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):మండలంలోని శివాలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పుత్తూరు పట్టణం కార్వేటినగరం రోడ్డులో ఉన్న కామాక్షి దేవి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయం, రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సదాశివేశ్వర ఆలయంలో భక్తులు దీపాలను వెలిగించారు. సాయంత్రం సదాశివేశ్వర స్వామి ఆలయంలో సదాశివుడికి అన్నాభిషేకం నిర్వహించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు పలు మెమో రైళ్ల రద్దు

తడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట - తడ మధ్య జరుగుతున్న రైల్వే ఇంజనీరింగ్ పనుల దృష్ట్యా సదరన్ రైల్వే పలు మెమో లోకల్ రైళ్లను రద్దు చేసింది. సూళ్లూరుపేట సమీపంలోని కాళంగినది వద్ద బ్రిడ్జికి మరమ్మతులు చేస్తుండడంతో శుక్రవారం అర్ధరాత్రి 12నుంచి శనివారం ఉదయం 8గంటల వరకు సూళ్లూరుపేట - తడ మధ్య రైళ్ల రాకపోకలను నిలిపివేశారు.

రద్దైన రైళ్ల వివరాలు

- ట్రైన్ నెంబరు 06745, సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు ఉదయం 7.50 నిమిషాలకు బయలుదేరే మెమో రైలు
- ట్రైన్ నెంబరు 06746, నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.20 నిమిషాలకు వచ్చే మెమో రైలు
- ట్రైన్ నెంబరు 06741, చెన్నై నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 5.15 నిమిషాలకు బయలుదేరే రైలు
- ట్రైన్ నెంబరు 06742, సూళ్లూరుపేట నుంచి చెన్నైకు మధ్యాహ్నం 12.30 నిమిషాలకు బయలుదేరే మెమో రైలును పూర్తిగా రద్దు చేశారు.

ఇవే కాకుండా సూళ్లూరుపేట - చెన్నై మధ్య నడిచే పలు లోకల్ రైళ్లను సూళ్లూరుపేట, ఎలాఊరు మధ్య పాక్షికంగా రద్దు చేశారు. ఆ రైళ్లు ఎలాఊరు నుంచి చెన్నై మధ్య రాకపోకలు సాగిస్తాయి.

లారీని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

నాయుడుపేట టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట - పండ్లూరు జాతీయ రహదారి సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. లారీ, బస్సు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





వెంకటగిరి - నాయుడుపేట రోడ్డు, మోడల్ స్కూల్ రహదారిలో మలుపులు

మలుపులు... ప్రమాదాల పిలుపులు



రైల్వే స్టేషన్ రోడ్డులో మలుపు

వెంకటగిరి టౌన్, నవంబరు 15 (నవంబరు): వెంకటగిరి మండలంలోని ప్రధాన రహదారుల్లో పలు చోట్ల మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ప్రధానంగా వెంకటగిరి - నాయుడుపేట మార్గంలో నాలుగు మలుపులు ఉన్నాయి. ఎక్కడా సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అదే మార్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే వెంకటగిరి నుంచి రాపూరు వెళ్లే మార్గంలో కాంపాళెం క్రాస్ వద్ద పెద్ద మలుపు ఉంది. ఇక్కడ కూడా సూచిక బోర్డు లేకపోవడంతో ప్రమదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక చిన్నపాటి వర్షాలకే ఆర్అండ్‌బీ రోడ్లు కూడా గోతులు మయంగా మారాయి. వెంకటగిరి, నాయుడుపేట, గూడూరు రోడ్డు మార్గం రహదారులు అధ్వనంగా మాడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. వెంకటగిరి మోడల్ స్కూల్ వద్ద పైపులైను తవ్వడంతో పెద్ద గుంతగా ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కార్తీక పౌర్ణమి పూజలు



గూడూరు శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



చిల్లకూరు మండలం చేడిమాల గ్రామంలోని శివాలయంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు

గూడూరు/చిల్లకూరు/కోట/వెంకటగిరి టౌన్/సూళ్లూరుపేట/నాయుడుపేట టౌన్/తడ/ ఓజిలి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా గూడూరు పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ఆలయాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు జరిపారు. పట్టనంలోని శివాలయం, వీరభద్రస్వామి ఆలయం, సోమేశ్వరస్వామి ఆలయాలలో భక్తులు పూజలు చేసి కార్తీక దీపాలను వెలిగించారు. ● చిల్లకూరు మండలంలోని కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. బూదనంలోని శివాలయంలో జ్వాలాతోరణం నిర్వహించారు. అలాగే చేడిమాల గ్రామంలోని నాగలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించారు. ● కోట మండలంలోని గూడలి కామాక్షీదేవి సమేత సంఘమేశ్వరుడు, వంజివాకలోని కామాక్షీదేవి సమేత జలసిద్ధేశ్వరుడు, కోటలోని సోమేశ్వర ఆలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు జరిగాయి. ఆయా ఆలయాల్లో స్వామివారి విగ్రహాలకు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. గూడలి స్వర్ణముఖినదిలో కార్తీక దీపాలను వదిలారు. అదేవిధంగా వంజివాకలో ఆలయ ధర్మకర్త పొక్కాలి బాలాజీశెట్టి, సీనియర్ టీడీపీ నాయకులు కొనిశెట్టి రమేష్, దీప ఆధ్వర్యంలో జలసిద్ధేశ్వరస్వామికి పూలాభిషేకాలు జరిగాయి. ● వెంకటగిరి పట్టణంలోని పెద్ద శివాలయం, హరహర క్షేత్రం, రామలింగేశ్వర స్వామి, వల్లివేడు క్రాస్ రోడ్డు వద్ద మల్లిఖార్జున భ్రమరాంబ ఆలయం, బంగారుపేటలో విష్ణుదుర్గా పరమేశ్వరి శక్తి పీఠంలో శుక్రవారం కార్తీక పూర్ణిమ పూజలు నిర్వహించారు. రాత్రి కార్తీక దీపాలు వెలిగించారు. స్వామి వివేకానంద యువసేన ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ● సూళ్లూరుపేటలో పలు ఆయాల్లో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. పట్టణంలోని నాగేశ్వరస్వామి ఆలయం, మన్నారు పోలూరులోని సంతానేశ్వరస్వామి ఆలయం, కాల్యాణేశ్వరి ఆలయాల్లో ఉదయం నుంచే భక్తుల సందడి కనిపించింది. నాగేశ్వరస్వామి ఆలయంలో మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకనంతరం పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ కార్యాలయం వద్దనున్న అభయశంకరుడి ఆలయంలో రుద్రాభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ● నాయుడుపేట పట్టణంలోని శివాలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు నిర్వహించారు. స్వర్ణముఖినది తీరాన వెలసిన ప్రసునాంబ సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో వేకువజాము నుంచే మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. స్వర్ణముఖినదిలో భక్తులు స్నానాలు ఆచరించి నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ● తడ మండలంలోని బోడిలింగాలపాడు వద్ద ఉన్న భువనేశ్వరస్వామి ఆలయం, మాంబట్టు వద్ద ఉన్న అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వర ఆలయం, వాటంబేడులో ఉన్న విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర ఆలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు జరిగాయి. భువనేశ్వరస్వామికి అన్నాభిషేకం చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయంలో కార్తీక దీపాలను వెలిగించి శివనామస్మరణ చేశారు. ● ఓజిలి మండలంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు జరిగాయి. మండలంలోని పలు ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.









వెంకటగిరి టౌన్: పెద్ద శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు - కోటలోని సోమేశ్వరస్వామికి దీపాలంకరణ - సూళ్లూరు పేట: పుష్పాలంకరణలో నాగేశ్వరస్వామి - తడ: అన్నాభిషేకంలో శివయ్య

మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చండి

వెంకటగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ నేతలు కోరారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సీడీపీవో షంషాద్‌బేగంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు మంజుల మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు సేవలందిస్తున్న మినీ అంగన్‌వాడీ వర్కర్లకు పనిభారం ఎక్కువగా ఉన్నా తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మినీ వర్కర్లకు పదోన్నతి కల్పించడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలలని కోరారు. కార్యక్రమంలో రమణమ్మ, నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో చండీయాగం



చండీయాగంలో ఉభయకర్త దువ్వూరు బాలచంద్రా రెడ్డి

సూళ్లూరుపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా మహా చండీయాగం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ యాగం నిర్వహించారు. ఆలయ మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రా రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. యాగం అనంతరం ఉభయకర్తలకు సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

చెంగాళమ్మకు శారద పీఠం వస్త్రాల సమర్పణ

సూళ్లూరుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరికి శృంగేరి శారదా పీఠం వస్త్రాలను శుక్రవారం సమర్పించారు. శృంగేరి శారదపీఠం జగద్గురు విధుశేఖర భారతి స్వామి శిష్యుల ద్వారా అమ్మవారికి వస్త్రాలు అందజేశారు. వారికి ఆలయ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి స్వాగతం పలికారు.

సీపీఎం పట్టణ ఆర్గనైజింగ్ కమిటీ నియామకం

సూళ్లూరుపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణ సీపీఎం ఆర్గనైజింగ్ కమిటీని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా సుంకర అల్లెయ్య, సభ్యులుగా ఎస్.కె.రియాజ్, సీహెచ్ చంద్రశేఖర్, లక్ష్మయ్య, రామరాజు, కొండయ్య, బాల గురుమూర్తిని నియమించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మురళి, ఉపాధ్యక్షుడు పుల్లయ్య, జిల్లా శ్రామిక మహిళా అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

వెంకటగిరి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలు విన్నవించే ప్రతి సమస్యనూ పరిష్కరించాలని ఎంపీడీవో కోటీశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని యాతలూరులో సచివాలయాన్ని ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోటీశ్వరరావు మాట్లాడుతూ సిబ్బంది ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5.30వరకు ఖచ్చితంగా విధులు నిర్వహించాలన్నారు. విధులు సక్రమంగా నిర్వహించకపోతే జీతాల బిల్లులు పెట్టబోమన్నారు. బ్యాంక్ ఖాతాల్లో ఎన్‌పీసీఐ లింక్ చేయించాలని, మొత్తం 2190 ఇన్‌యాక్టివిటీలో ఉన్నాయని, వాటిని యాక్టివ్‌లో పెట్టాలని సూచించారు.

గురుకులాల్లో కార్పొరేట్ స్థాయి బోధన

కోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో కార్పొరేట్ స్థాయికి మించి విద్యాబోధన జరుగుతోందని బీసీ గురుకులాల రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ మాధవయ్య అన్నారు. కోట మండలం విద్యానగర్‌లోని బీసీ బాలికల గురుకులాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. గురుకులాల జిల్లా కన్వీనర్ నారాయణరావుతో కలసి పాఠశాలలోని గదులను పరిశీలించారు. విద్యాబోధనపై బోధన, బోధనేతర సిబ్బందితో సమీక్షించారు. అదేవిధంగా 10వ తరగతి పరీక్షా ఫలితాలపై ఆరా తీశారు. ప్రిన్సిపాల్ అంజనమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కెనరాబ్యాంకు సేవలు విస్తరిస్తున్నాం

ఎండీ సత్యనారాయణరాజు



కెనరాబ్యాంక్ సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బ్యాంకు ఎండీ, సీఈవో సత్యనారాయణరాజు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ రంగంలో సరికొత్త ఆలోచనలతో కెనరా బ్యాంకు సేవలను విస్తరిస్తున్నామని, తద్వారా ప్రజలకు మరింత చేరువవుతుందని బ్యాంకు ఎండీ, సీఈవో సత్యనారాయణరాజు తెలిపారు. ఎమ్మార్‌పల్లె పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ఏర్పాటు చేసిన కెనరా బ్యాంక్ సర్కిల్ కార్యాలయ సముదాయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. తిరుపతిలో ఇప్పటివరకు రీజనల్ బ్యాంకు మాత్రమే ఉండేదని, ప్రస్తుతం సర్కిల్ ఆఫీసు ఏర్పాటు చేశామని చెప్పారు. డబుల్ డిజిట్ గ్రోత్ సాధించి గత సెప్టెంబరులో రూ.4వేల కోట్ల లాభం ఆర్జించామన్నారు. నూతన పథకాల ద్వారా ప్రామాణికమైన వడ్డీరేట్లతో రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా మరో 250 బ్రాంచ్‌లను ఏర్పాటు చేయదలచామని వెల్లడించారు. ఖాతాదారుల సౌకర్యార్థం ఏఐ1 యాప్‌ను రూపొందించామని, తద్వారా సులభంగా బ్యాంకింగ్ సేవలు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు పాండురంగ, రామనాయక్, రవికృష్ణ, సత్యప్రకాష్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ ప్రసాద్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యేకు సునీల్‌కు టీడీపీ నేతల సత్కారం



సునీల్‌కుమార్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వానికి విన్నవించడం పట్ల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం విజయవాడలో ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం జిల్లాల పునర్విభజనలో గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలపడం జరిగిందన్నారు. జిల్లా కేంద్రం వెళ్లాలంటే దూరం కావడంతో ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ గూడూరును నెల్లూరులో కలుపుతామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. గూడూరు ప్రజల ప్రధాన సమస్యను అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే వినిపించినందుకు నియోజకవర్గ ప్రజల తరుపున ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ రహీం, బిల్లు చెంచురామయ్య, ఇశ్రాయిల్ కుమార్ తదిరులు పాల్గొన్నారు.

కుర్చీల వితరణ



సీడీపీవోకు కుర్చీలు అందజేస్తున్న జగదీష్

వెంకటగిరి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కుమ్మరిగుంట-1 అంగన్‌వాడీ కేంద్రానికి కెడిడ్ ఆక్సిస్ ఇండియా ఫౌండేషన్ నిర్వహకుడు జగదీష్ కుర్చీలు, కార్పెట్స్ శుక్రవారం వితరణగా అందించారు. ఏఎం సిద్దారెడ్డి, చంద్ర బాబు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

కోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం జరిగింది. డీఎల్‌పీవో వెంకటరమణ, ఎంపీడీవో వేణు, రీసోర్స్ పర్సన్లు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలకు శిక్షణ ఇచ్చారు. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో పంచాయతీలకు వచ్చే నిధులు, వాటి వినియోగంపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీపీ అంజమ్మ, జడ్పీటీసీ కోటయ్య, సర్పంచు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తెప్పలపై కల్యాణ వెంకన్న కటాక్షం

నారాయణవనం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీటీడీ అనుబంధ పద్మావతి దేవి సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో కార్తీక తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. తెప్పోత్సవాల్లో చివరి రోజు శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి స్థానిక పద్మసరస్సులో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం సుప్రభాత సేవ సహా నిత్య కైంకర్యాలు, స్వామిఅమ్మవార్ల మూలవిరాట్లకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉభయ నాంచారుల సమేతంగా కల్యాణ వెంకన్న ఉత్సవమూర్తులకు కల్యాణ మండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చిపై కొలువు దీర్చారు. మేళతాళాలు, భక్తుల కోలాటల నడుమ ఊరేగింపుగా పద్మసరస్సు వేంచేపు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించిన తెప్పలపై అధిష్ఠింపజేశారు. స్వామి వారు జలవిహారం చేస్తూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమాలను టీటీడీ స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ ధర్మయ్య, ఈఈ మల్లికార్జున, ఏఈ గురుప్రసాద్, ఆలయాధికారి నాగరాజు, పర్యవేక్షించారు.


శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న

పరశురామేశ్వరుడికి లక్ష బిల్వార్చన


బిల్వ పత్రాలను తీసుకువస్తున్న ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు దంపతులు

ఏర్పేడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం లక్ష బిల్వార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు దంపతుల ఆధ్వర్యంలో భక్తులు పెద్దసంఖ్యలో బిల్వపత్రాలను తీసుకువచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. స్వామిఅమ్మవార్లను దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ



శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం రాత్రి పౌర్ణమిని పురస్కరించుకుని ఊంజల్‌సేవ నేత్రపర్వంగా సాగింది. మొదట ఆలయంలోని అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఉత్సవమూర్తులకు పలు అభిషేక పూజలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠింపజేసి ఊంజల్‌సేవ మండపానికి తీసకువచ్చారు. పౌర్ణమి వెండి కాంతుల్లో ఊంజల్‌సేవలో ఊయల ఊగుతున్న స్వామిఅమ్మవార్లను భక్తులు దర్శించు కున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

శాస్త్రోక్తంగా ఆకాశ దీపం



శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఆకాశ దీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశదీపాన్ని వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు విశేషంగా దీపాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి సతీమణి సుధా, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు


లాడ్జీల నిర్వాహకులకు సూచనలిస్తున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): లాడ్జీల నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి హెచ్చరించారు. 1టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం పట్టణంలోని లాడ్జీల నిర్వాహకులు, సిబ్బందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గదులు కేటాయించే సమయంలో వారిని ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. అన్ని లాడ్జీల వద్ద గదుల ధరల పట్టిక ఏర్పాటు చేయాలని సూచించారు. అధిక ధరలు వసూలు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. మధ్యవర్తుల ద్వారా భక్తులకు గదులు కేటాయించి కమీషన్ల కోసం అధిక ధరలు వసూలు చేస్తే ఉపేక్షించమన్నారు. అలాగే అనుమానిత వ్యక్తులు, అసాంఘిక కార్యకలపాలకు ఆశ్రయం ఇవ్వడం నేరంగా పరిగణిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 1టౌన్ సీఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.2లక్షల విరాళం



శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తిరుపతికి చెందిన సుజాత రూ.2లక్షలు విరాళం అందజేశారు. ఈ చెక్కును ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామిఅమ్మవార్ల దర్శనం ఏర్పాట్లు చేయించారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పామాయిల్ మొక్కల పంపిణీ

పిచ్చాటూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆయిల్‌పాం మొక్కలు కావాలని కోరుతున్న రైతులకు శుక్రవారం త్రీ ఎఫ్ పాం, పీవీటీ, ఎల్‌టీడీ నర్సరీ ద్వారా అందించిన రాయితీపై పామాయిల్ మొక్కలను రైతులకు పంపిణీ చేశారు. కొత్త గొల్లకండ్రిగలో రైతుల పొలాల వద్ద క్షేత్రస్థాయికి వెళ్లి మొక్కలను నాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలిక పంట కావడంతో పాటు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఏడాది పొడవునా అందిస్తుందన్నారు.

నేడు శృంగేరి శారద పీఠాధిపతి రాక


ఏర్పాట్ల పరిశీలనలో ఈవో

శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి శనివారం శృంగేరి శారద పీఠాధిపతి విచ్చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈవో బాపిరెడ్డి పీఠాధిపతి వచ్చే మార్గాన్ని పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఏవో లోకేష్‌రెడ్డి, ఏఈవో హేమమాలిని, ఈఈ మురళీధర్, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా శుక్రవార ఉత్సవం

శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు తీర్చారు.

శివపార్వతి కూడలిలో వెలగని విద్యుత్ దీపాలు


శివపార్వతుల కూడలిలో స్వామిఅమ్మవార్ల పక్కనే ఉన్న స్తంభంలో వెలుగుతున్న ఒకే ఒక్క దీపం

శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నడిబొడ్డున్న ఉన్న శివపార్వతుల కూడలిలో వీధిదీపాలు సక్రమంగా వెలగకపోవడంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ పరిసరాలు మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే ప్రధాన కూడలిలో విద్యుత్‌కాంతుల అలంకరణలో దేవతామూర్తుల హోర్డింగ్‌లు, చతుర్మాడ వీధుల్లో విద్యుత్ అలంకరణలు విశేషంగా ఏర్పాటు చేశారు. చెన్నై, పిచ్చాటూరు రహదారి నుంచి వీఎంసీ కూడలి మీదుగా భక్తులు ముక్కంటి ఆలయానికి విచ్చేస్తుంటారు. గత కొద్ది సంవత్సరాల క్రితం వీఎంసీ కూడలిలో శివపార్వతుల ప్రతిమలను ఏర్పాటు చేసి ఆ ప్రాంతానికి నామకరణం చేశారు. అప్పటి నుంచి శివపార్వతుల కూడలిగా ప్రసిద్ధి చెందింది. ప్రస్తుతం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలో పలు చోట్ల విద్యుత్ కాంతులు శోభిల్లుతున్నాయి. పార్వతీ పరమేశ్వరులు ఉన్న కూడలి మాత్రం కనీసం శుభ్రం కూడా చేయలేదు. ఇక ఈ కూడలిలో హైమాస్ట్ విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి స్టాండ్‌లో నాలుగు ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు. వారం రోజుల నుంచి కేవలం ఒకటి మాత్రమే వెలుగుతోంది. కార్తీక పౌర్ణమి పర్వదినం రోజున శివ పార్వతుల కూడలిలో కనీస వెలుతురు కూడా లేకపోవడంపై స్థానికులు సామాజిక మాధ్యమాల ద్వారా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్రణాళికతోనే పంచాయతీల అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

సత్యవేడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికలతోనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ ప్రణాళికలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, సంఘమిత్రలు, ఆరోగ్య సిబ్బందికి మండల స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో పనులను గుర్తించి గ్రామ సభలను నిర్వహించాలని కోరారు. గ్రామాభివృద్ధికి సంబంధించి గ్రామ సభల ద్వారా ఆమోదించిన అత్యవసర పనులను 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా చేపట్టాలన్నారు. ఈవోపీఆర్డీ తరుణాక్ష రెడ్డి, సెక్రటరీ ముని రవికుమార్, ఎంపీహెచ్‌ఓ సుబ్రమణ్యం రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

రేణిగుంట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న పథకాలను అమలు చేసి పంచాయతీల అభివృద్ధికి ఐక్యంగా కృషి చేద్దామని నోడల్ అధికారి, ఎంపీడీవో విష్ణు చిరంజీవి చెప్పారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... ఆర్థిక వనరులను సమానంగా ఉపయోగించుకునేలా ప్రణాళికలు రూపొందించు కోవాలన్నారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలోని ముఖ్యమైన అంశాలను వివరించారు.

బుచ్చినాయుడుకండ్రిగ: ఇక నుంచి పంచాయతీల్లో గ్రామసభల ద్వారా గుర్తించిన వారికే సంక్షేమ పథకాలు వర్తిస్తాయని ఎంపీడీవో త్రివిక్రమరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచులకు శుక్రవారం అవగాహన కల్పించారు. పంచాయతీల్లో 2025 జనవరి 31నాటికి పాఠశాల విద్యార్థులు, మహిళలు, రైతులు సహా గ్రామస్తుల కోసం తలా గ్రామసభ నిర్వహించాలన్నారు. ఈవోపీఆర్డీ, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

ముగిసిన భగవద్గీత పారాయణం


ప్రవచిస్తున్న విద్యాస్వరూపానందగిరి

శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శుక బ్రహ్మాశ్రమంలో శుక్రవారం అఖండ భగవద్గీత పారాయణం ముగిసింది. అనంతరం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అఖండ అర్చన నిర్వహించారు. ప్రజలు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 13వ యూనిట్ పరిధిలో టీడీపీ ఇన్‌చార్జి ఎస్.బుజ్జి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు జోరుగా సాగింది. ఈ సందర్భంగా ఆయన టీడీపీ సభ్యత్వం తీసుకోవడం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎం.శివకుమార్, నాగమ్మ, సుధాకర్, జ్ఞానప్రకాష్, రమణ, మనోర్మణి, సుందరి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ

వరదయ్యపాళెం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. ఏవో శ్రీనివాస్ మాట్లాడుతూ... వరి నారు కట్టలు కట్టిన తరువాత కొనలు తుంచి నాటితే కాండం తొలుచు పురుగు ఉధృతిని తగ్గించవచ్చన్నారు. కాలిబాటలతో సుడి దోమను నియంత్రియవచ్చని తెలిపారు. ఎరువుల వినియోగంపై సూచనలిచ్చారు. విస్తరణ అధికారి ప్రవీణ్, వ్యవసాయసహాయకులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

పిచ్చాటూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీరువాయి బీసీ కాలనీకి చెందిన రవీంద్ర ఇల్లు సహా గృహోపకరణాలు, నగదు, ఆభరణాలు శుక్రవారం వేకువ జామున జరిగిన షార్ట్ సర్క్యూట్‌తో కాలి బూడిదయ్యాయి. కేవలం కట్టుకున్న బట్టలు మాత్రమే మిగిలాయి. రూ.10 లక్షలు మేర ఆస్తి నష్టం వాటిలినట్టు బాధితుడు చెప్పాడు.

సంగీత ప్రవీణ పాలకూరి రంగనాథ్ మృతి



శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సంగీత, నాట్య కళాకారులకు పాలకూరి రంగనాథ్ మృతి తీరని లోటని రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఆశ పేర్కొన్నారు. శ్రీకాళహస్తికి చెందిన సంగీత ప్రవీణ పాలకూరి రంగనాథ్ దశాబ్దాల పాటు స్థానికులకు సంగీతాన్ని నేర్పించినట్లు ఆమె తెలిపారు. సంగీత గురువుగా ఎందరికో పాఠాలు నేర్పారన్నారు. ఆయన మృతి పట్ల పలువురు కళాకారులు, సంగీతప్రియులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

వర్షాలకు నీట మునిగిన వరి




బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని జంబుగోళంలో వరి పంట నీట మునిగి కుళ్లి పోతోంది. గ్రామంలో 20 రోజులు క్రితం పది మంది రైతులు వరి నాట్లు వేశారు. నారు ఎదిగే సమయంలో నాలుగు రోజులు నుంచి వర్షాలు కురుస్తుండటంతో పూసలపల్లి, చిన్నాయ్యగుంట నీటితో పాటు వరవ కాలువ ఎనీరు పొలాల్లో నిలిచిపోవడంతో పంట కుళ్లి పోతోంది. అప్పు చేసి పంట వేశామని వర్షాలకు పనికి రాకుండా పోతోందన్నారు. వ్యవసాయ అధికారులు పరిశీలించి ఆదుకోవాలని కోరారు.

వేడుకగా కార్తీక దీపోత్సవం



అంజూరవారి మండపంలో రామాపురం రిజర్వాయర్‌లో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి విశేష పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు శివాలయాలకు పోటెత్తారు. నిండుపున్నమి చంద్రుడు ఆకాశంలో ప్రజ్వలించిన ప్రదోశ వేళ 365 వత్తులతో దీప జ్యోతులను వెలిగించారు. పట్టణంలోని జెట్టిపాళెంలో చక్రేశ్వరస్వామి ఆలయం, కుందేటివారి వీధిలోని బృహదీశ్వరాలయం, పట్టణ శివారు స్వర్ణముఖి నది ఒడ్డున అర్ధనారీశ్వరాలయం తదితర శివాలయాలు, వేడాంలోని వెయ్యిలింగాల కోన, భైరవకోన, కొండచుట్టూ మార్గంలోని అంజూరువారిమండపంలల్లో భక్తులు దీపాలు వెలిగించారు

పుస్తక ప్రదర్శన


శ్రీకాళహస్తి గ్రంథాలయంలో సరస్వతిదేవికి పూజలు

శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో 57 జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ముందుగా సరస్వతిదేవికి పూజలు చేశారు. పుస్తక ప్రదర్శనకు పలు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి హరికృష్ణ తెలిపారు. తొట్టంబేడు మండలకేంద్రంలో శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయాల్లో ప్రతి ఒక్కరు సభ్యులుగా చేరాలని సూచించారు.

ఏర్పేడు: గ్రంథాలయ వారోత్సవాలను ఏర్పేడు గ్రంథాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు 20న జరిగే ముగింపు ఉత్సవాల్లో బహుమతులను ప్రదానం చేయనున్నారు.

నారాయణవనం: పట్టణంలోని గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి జీవన్ మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని ఆర్జించవచ్చన్నారు.. పలు రకాల పుస్తకాలను ప్రదర్శనగా పెట్టడంతో, విద్యార్థులు వాటిని అసక్తిగా తిలకించారు.

పట్టణ పేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలి

శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణ పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో సీపీఐ, ఏఐటీయూసీ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ... మౌలిక సదుపాయల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 18న సచివాలయల ఇళ్లకోసం దర్నా నిర్వహిస్తున్నామన్నారు. 26న కలెక్టరేట్ వద్ద రైతు సమస్యల పరిష్కారానికి ఆందోళన చేట్టనున్నామని తెలిపారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేడాంలో కొలువై ఉన్న దక్షిణ కాళికాదేవి ఆలయంలో మూలమూర్తిని రాహు కాల సమయంలో అర్చకులు అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తీర్థప్రసాద వినియోగం, మధ్యాహ్నం అన్నదానం జరిగాయి.

కనకదుర్గమ్మకు...

ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువై ఉన్న కనకదుర్గమ్మకు శుక్రవారాన్ని పురస్కరించుకుని విశేష అభిషేకాలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎన్‌ఎంయూ కార్యవర్గం

సత్యవేడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఏపీఎస్ ఆర్టీసీ డిపోకు చెందిన ఎన్‌ఎంయూ (నేషనల్ మజ్దూర్ యూనిట్) అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక ఎన్‌ఎంయూ భవనంలో శుక్రవారం యూనిట్ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా సుధాకర్, అధ్యక్షుడిగా పార్థసారథి రెడ్డి, డిపో కార్యదర్శిగా వీ.బాబు, ట్రెజరర్‌గా యుగంధర్, గ్యారేజీ అధ్యక్షుడిగా కుప్పయ్య. సెక్రటరీగా శేఖర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యూనియన్ కార్యదర్శి చెంచులయ్య, జిల్లా కార్యదర్శి బీఎస్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు గుణశేఖర్, సీసీఎస్ డెలిగేట్ సభ్యుడు సుధాకర్, సీనియర్ నాయకుడు డీవీఆర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని ఆధార్ కేంద్రాలు

ఇబ్బందుల్లో ప్రజలు

కేవీబీపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో పేరుకు మూడు ఆధార్ కేంద్రాలున్నా సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. గతంలో మీసేవలో ఆధార్ సెంటర్లు ఉన్న సమయంలో సేవలు సకాలంలో అందేవి. విభజన నేపథ్యంలో చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాగా మార్పు చేసు కోవాల్సి ఉంది. అయితే మండలంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలు పని చేయక పోవడంతో పిచ్చాటూరు మండలంలో వెంకటరెడ్డికండ్రిగలోని సచివాలయం, శ్రీకాళహస్తి పట్టణంలోని మీసేవ కేంద్రాలకు ప్రజలు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి మండలంలోని ఆధార్ కేంద్రాలను పని చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మాధవమాలలో 104 సేవలు

ఏర్పేడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవమాలలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఏర్పేడు ప్రభుత్వ వైద్యశాల అధికారులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన యువకుడిని పోక్సో చట్టం కింద అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు తెలిపారు. ఒంటరిగా ఉన్న బాలికతో అసభ్యకరంగా వ్యవహరించడంతో కేకలు వేసింది. బాలిక కుటుంబీకులు యువకుడిని పట్టుకునేలోగా బైక్‌పై పారిపోయాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడిని తిరుపతి కోర్టులో హాజరు పరచగా 15 రోజులు రిమాండ్‌ను విధించనట్లు పేర్కొన్నారు.

ఆకతాయిల బైండోవర్

మండలంలోని ఉబ్బలమడుగు జలాశయంలో విహారయాత్రకు వచ్చిన ఐదుగురు ఆకతాయిలపై కేసు నమోదు చేసి తహసీల్దార్ సుబ్రమణ్యం ఎదుట శుక్రవారం బైండోవర్ పరిచినట్లు ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు తెలిపారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, Shaik Rahana (Old name), W/o Shaik Babu R/o 1-9, Nernipalli Village, V.Kota Mandal, Chittoor Dist, A.P. PIN-517424,. Hence forth my name has been changed to SHAIK RIHANAA (New name)
AJT-4714

CHANGE OF NAME
I, YELLANTI GOWTHAM S/o YELLANTI RAVEENDRA REDDY Residing at 000, Chinna Darga Road, Naidupeta (P&M) - 524126, TIRUPATI (Dist), A.P. Hence I state That My Name has been Changed from YELLANTI GOWTHAM REDDY (My Old Name) to YELLANTI GOWTHAM (My New Name).
AJT-4712

CHANGE OF NAME
I, Moinuddin Nasiruddin (old name), S/O M.A.S.Mayunuddian R/O # 9/12, Besides KPS Main Gate, Chinnakurlapalli, Kuppam Mandal, Chittoor Dist, A.P. PIN-517425, Hence forth my name has been changed to Mayunuddian Nasiruddin (New name)
AJT-4715

WANTED
ప్రకృతి ఇన్‌ఫ్రాలో పనిచేయుటకు, Receptionist టెలికాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర.: రామానుజ సర్కిల్, SBI U/s 2nd ఫ్లోర్, తిరుపతి. సెల్ : 97411 63131.
AJT-4711

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిజిస్టర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర 7382114647
AJA- 198468

TOURS&TRAVELS
42 years experience సాయికళ టూర్స్ & ట్రావెల్స్ మదనపల్లె 1) సింగపూర్, మలేషియా 5N/6D, 80,000/- తేదీ: 20-01-25, 2) శ్రీలంక 6N/7D, 52,220/- తేదీ: 27-01-25, సం.ప్ర. సెల్: 94403 59204
AJT-1151

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, టట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి